ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మెదక్
20
గురువారం 3 ఆగస్టు 2017



'వినియోగదారుడి'పై గుదిబండ



- ప్రతి నెలా రూ. 4 పెరగనున్న సిలిండర్ ధర
- సబ్సిడీని తొలగించేందుకు కేంద్రం నిర్ణయం
- జిల్లాలో 1, 55, 917 గ్యాస్ కనెక్షన్లు
- జిల్లా ప్రజలపై ఏటా రూ. 74.84 లక్షల భారం

5



పంద్రాగస్టుకూ పాత దుస్తులేనా?

విద్యార్థులకు అందని యూనిఫాం

- మంత్రి మాటలు నీటి మూటలేనా?
- పాత, చినిగిన దుస్తులతోనే బడికి
- జెండా పండగకైనా విద్యార్థులకందేనా?

జిల్లా విద్యాసంస్థలు ప్రారంభమై రెండు నెలలవుతున్నా ఇప్పటికీ ప్రభుత్వ పారశాలలకు యూనిఫాం అందలేదు. విద్యాసంవత్సరం ప్రారంభం కాగానే విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందజేయాలని సాక్షాత్తూ మంత్రి హామీ ఇచ్చినా నెరవేరలేదు. విద్యార్థులు చినిగిన చొక్కాలతోనే బడి బాట పట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ సారి పంద్రాగస్టుకైనా ప్రభుత్వం దుస్తులు పంపిణీ చేస్తుందా? లేదా అన్న అనుమానాలు కలుగుతున్నాయి.

5



పాత దుస్తులతోనే రాజ్‌పల్లి పారశాలకు వచ్చిన విద్యార్థులు

వందశాతం మరుగుదొడ్లు తప్పనిసరి

- నిర్మాణాలకు అన్ని గ్రామాల్లో అందరూ సహకారం అందించాలి
- భుజరంపేట గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించిన కలెక్టర్ భారతిహోళికేరి



కౌడిపల్లి మండలం భుజరంపేటలో వందశాతం మరుగుదొడ్లను నిర్మించుకోవాలని ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ భారతిహోళికేరి

4

చెరువుల్లో చేపపిల్లల్ని వదలండి

- వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్లతో మంత్రి తలసాని ఆదేశం
- జిల్లాలో 4.58 కోట్ల చేపపిల్లల పంపిణీకి చర్యలు : కలెక్టర్ భారతిహోళికేరి

4

డేంజర్ స్పాట్‌కు మోక్షం

- నాగులపల్లి హైవే చౌరస్తాకు అండర్‌బ్రిడ్జి నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్
- రూ.34.35 కోట్లు మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం
- టెండర్ ప్రక్రియ పూర్తయితే పనులు మొదలు
- ఎంపీ కృషితో నిధుల మంజూరు

4



ప్రమాదకరంగా మారిన నాగులపల్లి చౌరస్తా

ఇంటర్వ్యూ



అవినీతి అక్రమాలకు తావులేకుండా
డబుల్ బెడ్‌రూం ఇళ్లు

- మడుపు భూంరెడ్డి, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్

కొండపాక : ఎలాంటి అవినీతి అక్రమాలకు తావులేకుండా నిరుపేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నట్టు రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ మడుపు భూంరెడ్డి చెప్పారు. పలు విషయాలపై ఆయన ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడారు.

రాష్ట్రంలో డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం ఎలా సాగుతోంది ?

డబుల్ బెడ్ ఇళ్ల నిర్మాణం చురుగ్గా సాగుతోంది. పేదల కనీస వసతి అయిన సొంతింటి కల నెరవేర్చడానికి సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా ఈ పథకాన్ని రూపొందించారు.

ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్ని ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావొస్తున్నాయి ?

ఇప్పటివరకు లక్షా 60 వేల గృహాలు పూర్తికావొస్తున్నాయి. దసరాకు 49 వేల ఇళ్లలో గృహ ప్రవేశాలుంటాయి.

గ్రామీణ ప్రాంతాల్లో ఎన్ని ఇళ్లు నిర్మించనున్నారు ?

గ్రామీణ ప్రాంతాలు విడివిడిగా కాలనీలుగా ఇళ్లను నిర్మిస్తున్నాం. ఈ బడ్జెట్‌లో రూ. 17 వేల కోట్ల నిధులు కేటాయించారు. 31 జిల్లాలో 3 లక్షల గృహాలు నిర్మించడం లక్ష్యం.

పూర్వపు మెదక్ జిల్లాలో ఎన్ని గృహాలు మంజూరు చేశారు.

నిర్మాణాలు ఎంతవరకు వచ్చాయి ?

ఉమ్మడి జిల్లాలో 11,883 ఇళ్లకు కలెక్టర్లు అనుమతి ఇవ్వగా అందులో 2203 లబ్ధిదారులకు ఎంపిక చేశాం. 8796 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. వివిధ దశల్లో పనులు సాగుతున్నాయి.

సిద్దిపేట జిల్లాలో ఎన్ని ఇళ్లు మంజూరయ్యాయి ?

సిద్దిపేట జిల్లాలో 8092 ఇళ్లు మంజూరు కాగా వాటి నిర్మాణాలు సాగుతున్నాయి. 568 ఇళ్లు పూర్తయ్యాయి. లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించి అప్పగించాం.

ఇళ్ల నిర్మాణాల పర్యవేక్షణ నిర్మాణ బాధ్యతలు ఎవరు చూస్తున్నారు ?

పేదలకు సొంతింటి కల నెరవేర్చడం కోసం సీఎం కేసీఆర్ లక్ష్యం. పేదల కళ్లలో ఆనందాన్ని చూడటం సీఎం కోరిక. ఆ దిశగా డబుల్ బెడ్ రూం ఇళ్లను నిర్మించాలని నిర్ణయించారు. లబ్ధిదారుల ఎంపిక, నిర్మాణం పూర్తయ్యాక లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించే దాకా అంతా జిల్లా కలెక్టర్ల ఆధీనంలో పనులు సాగుతాయి. ఇళ్ల నిర్మాణంలో అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారం అందించడాన్ని బాధ్యతగా తీసుకుంటున్నారు. గతంలో గృహ నిర్మాణ సంస్థలో పని చేసిన ఉద్యోగులను వివిధ శాఖలకు కేటాయించారు. ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్, ఆర్ అండ్‌బీ, ఇరిగేషన్, ఐటీడీఏ శాఖల వారు నిర్మాణ పనులు చూస్తున్నారు.



ఉద్యోగపర్వం





విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్
చరిత్రాత్మకం

విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ చరిత్రాత్మకమని ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ఐఎన్‌టీయూసీ (327) రీజినల్ అధ్యక్షుడు సార ప్రభాకర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి భూపాల్‌రెడ్డి తెలిపారు. అయితే విద్యుత్ సంస్థలో పని చేస్తున్న సిబ్బందికి సరైన సామగ్రి అందజేయకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. ప్రతి గ్రామానికి ఒక జూనియర్ లైన్‌మన్‌ను నియమించాలని.. నాణ్యమైన పరికరాలను వాడేలా కాంట్రాక్టర్లపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. రెగ్యులరైజ్ చేసిన కొత్త ఉద్యోగులకు ఓటు హక్కును కల్పించాకే విద్యుత్ ఉద్యోగుల యూనియన్‌కు ఎన్నికలు నిర్వహించాలన్నారు. అలాగే పలు విషయాలపై వారు మాట్లాడారు.. ఆ వివరాలు వారి మాటల్లోనే..

- ఇచ్చిన మాట నిలబెట్టుకున్నముఖ్యమంత్రి కేసీఆర్
- 20,903 మంది విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగుల కుటుంబాల్లో కొత్త వెలుగులు
- ప్రమాదాల నుంచి రక్షణకు సిబ్బందికి సామగ్రిని అందజేయాలి
- సరైన మెటీరియల్ ఉపయోగించేలా కాంట్రాక్టర్లను ఆదేశించాలి
- విద్యుత్ ఉద్యోగుల యూనియన్ (ఐఎన్‌టీయూసీ) రీజినల్ అధ్యక్ష, కార్యదర్శులు సార ప్రభాకర్‌గౌడ్, భూపాల్‌రెడ్డి

సంగారెడ్డి టౌన్ : రాష్ట్రంలో 20,903మంది కాంట్రాక్టు ఉద్యోగులను ఆర్టిజన్లుగా గుర్తించి విద్యుత్ సంస్థలో విలీనం చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం విద్యుత్ బోర్డులోనే చరిత్రాత్మక నిర్ణయం. 25 సంవత్సరాలుగా విద్యుత్ శాఖలో కాంట్రాక్టు ఉద్యోగులుగా చేరి విధులు నిర్వహిస్తున్న వారికి రెగ్యులరైజ్ చేయడంలో ముఖ్యమంత్రి కేసీఆర్, ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావులకు 20,903 ఉద్యోగుల కుటుంబాలు రుణపడి ఉంటాయి. ప్రభుత్వ నిర్ణయంతో ఉమ్మడి మెదక్ జిల్లాలో 1850 మంది కాంట్రాక్టు ఉద్యోగులుండగా 1736 మంది ఉద్యోగులకు రెగ్యులరైజ్ అయింది. ఇందులో హైస్కిల్డ్ కింద 14 మంది, స్కిల్డ్ కింద 1452 మంది, సెమీ స్కిల్డ్ కింద 134 మంది, అన్‌స్కిల్డ్ కింద 136 మంది కాంట్రాక్టు ఉద్యోగులు రెగ్యులరైజ్ కానున్నారు. తెలంగాణ సాధన కోసం సాగిన ఉద్యమంలో విద్యుత్ ఉద్యోగుల పాత్ర అమోఘం. మా సేవలు గుర్తించిన ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం రెగ్యులరైజ్ చేసి 20,903 మంది విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగుల కుటుంబాల్లో కొత్త వెలుగులు నింపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడడం వల్లే ఉద్యోగులకు పదోన్నతులు, కొత్త ఉద్యోగాలు లభిస్తున్నాయి.

ఎర్త్ రాడ్‌లు లేకపోవడం వల్లే ప్రమాదాలు

విద్యుత్ సంస్థలో పని చేస్తున్న జూనియర్ లైన్ మెన్లు, హెల్పర్లు, లైన్‌మెన్లకు ఎర్త్ రాడ్‌లు సరఫరా చేయకపోవడం వల్లే విద్యుత్ ప్రమాదాలు కొనసాగుతున్నాయి. విద్యుత్ బోర్డు నుంచి ఎర్త్‌రాడ్లు, రబ్బర్ హ్యాండ్‌గ్లౌజులు, హెల్మెట్లు, రెయిన్‌కోర్టులు, షూస్‌లు సరఫరా అవుతున్నప్పటికీ స్టోర్ రూంలకే పరిమితం అవుతున్నాయి. కింది స్థాయి సిబ్బందికి వాటిని అందజేయడం లేదు. దాంతో విద్యుత్ సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, కరెంట్ తీగల వల్ల ప్రమాదాలు సంభవించి ఉద్యోగులు మృత్యువాత పడుతున్నారు. కిందిస్థాయి ఉద్యోగులందరికీ ఎర్త్‌రాడ్‌లు, రబ్బర్ హ్యాండ్ గ్లౌజులు, హెల్మెట్‌లు, రెయిన్‌కోర్టులు, షూస్‌ను పంపిణీ చేయాలి. అలాగే ప్రతి గ్రామానికి ఒక జూనియర్ లైన్‌మన్‌ను నియమించినప్పుడే నాణ్యమైన విద్యుత్ సేవలను అందించగలుగుతాము.

కాంట్రాక్టర్లపై ఒత్తిడి పెంచాలి

విద్యుత్ స్తంభాలు, సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుతో పాటు తదితర పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం వల్ల విద్యుత్ ఉద్యోగులు ఇబ్బందుల పాలవుతున్నారు. నాణ్యమైన పరికరాలను వాడేలా కాంట్రాక్టర్లపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరమున్నది. బ్రాండెడ్ మెటీరియల్‌ను వాడకపోవడం వల్ల విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో ఉద్యోగులతో పాటు సాధారణ పౌరులు, మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి.

కొత్త ఉద్యోగులకు ఓటు హక్కు కల్పించాలి

రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసిన కొత్త ఉద్యోగులకు ఓటు హక్కును కల్పించిన తర్వాతే విద్యుత్ ఉద్యోగుల యూనియన్‌కు ఎన్నికలు నిర్వహించాలి. ఈ నెల 8న నిర్వహించాల్సిన విద్యుత్ ఉద్యోగుల యూనియన్ ఎన్నికలు సెప్టెంబర్ 8నాటికి వాయిదా పడ్డాయి. కొత్తగా పర్మినెంట్ అయిన 1736 మంది ఉద్యోగులకు ఓటు హక్కు కల్పించిన తరువాతే ఎన్నికలు నిర్వహించాలి. అప్పటి వరకు ఎన్నికలు నిర్వహించకుండా వాయిదా వేయాలి.

రేషన్ డీలర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- శశికాంత్, రేషన్ డీలర్ల అసోసియేషన్ సంగారెడ్డి పట్టణ అధ్యక్షుడు

ఉద్యోగపర్వం



రేషన్ డీలర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి. ప్రజా పంపిణీ వ్యవస్థలో ప్రజలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తూ రేషన్ డీలర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రేషన్ డీలర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి నెలకు కనీస వేతనంగా రూ.30 వేలు అందించాలి. రేషన్ డీలర్లకు వడ్డీలేని రుణాలు, కుటుంబసభ్యులకు హెల్త్ కార్డులు, ఇల్లు లేని వారికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి. ప్రజలకు నిత్యావసర వస్తువులు బియ్యం, కందిపప్పు, చక్కెర, గోధుమలు, గోధుమపిండి, సబ్బులు, పేస్ట్, టూత్ బ్రష్‌లు ఇతరత్రా 16 రకాల సరుకులు అందించి వాటి పై డీలర్లకు రూ. 2 చొప్పున కమీషన్ ఇవ్వాలి. మంత్రి ఈటెల రాజేందర్ నెల రోజుల సమయంలో డీలర్ల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి హామీ మేరకు నిరాహార దీక్షను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నాం. ఇచ్చిన గడువులోపల సమస్యలు పరిష్కరించకుంటే తిరిగి సమ్మె చేస్తాం.

- సంగారెడ్డి రూరల్

భక్తి

పంటలకు రక్షణగా పశుపతినాథ్

- గంగాధర శర్మ, పురోహితుడు





తమ పనులకు వెళ్లే ముందు గ్రామంలోని పశుపతినాథ్ ఆలయంలో శివుడిని దర్శించుకుని వెళ్తే అనుకున్న పనుల్లో విజయం సాధిస్తారని భక్తుల నమ్మకం. సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామంలో గ్రామ పెద్దలు, గ్రామస్థులు కలిసి తమ సామర్థ్యాన్ని బట్టి చందాలు వేసుకుని 2011లో ఆలయాన్ని నిర్మించారు. ఈ ఆలయంలో లక్ష్మీగణపతి, ఆంజనేయస్వామి ఆలయాలు ఉన్నాయి. ఎక్కడా లేని విధంగా ఆలయాలకు టేకు కలపతో తయారు చేసిన తలుపులను అమర్చారు. ఈ ఆలయంలో రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా మర్కట లింగం కలిగి ఉండడం విశేషం. ఈ గ్రామంలో దో ఫసల్ (రెండు పంటలు) పండుతుండడం వల్ల ఎల్లప్పుడు పంటలు పాడవకుండా సుభిక్షంగా ఉండాలని ఈ ఆలయానికి పశుపతినాథ్ ఆలయంగా నామకరణం చేశారు. ఈ ఆలయంలో మహాశివరాత్రికి అభిషేకాలతో పాటు వరలక్ష్మి వ్రతాలు, హనుమాన్ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తారు. ప్రతి యేట మార్చిలో ఆలయ వార్షికోత్సవాలు నిర్వహిస్తారు. **- సంగారెడ్డి రూరల్**

ఏఐసీసీ సౌత్‌జోన్

కో ఆర్డినేటర్‌గా గీతారెడ్డి



జహీరాబాద్: ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ(ఏఐసీసీ) సౌత్‌జోన్ రీజనల్ కో ఆర్డినేటర్‌గా మాజీ మంత్రి, జహీరాబాద్ ఎమ్మెల్యే జె.గీతారెడ్డి నియమితులయ్యారు. ఈ నెల 1వ తేదీన ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియాగాంధీ ఆదేశాల మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జనార్దన్ ద్వివేది గీతారెడ్డి నియామకాన్ని ఆమోదించారు. ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీలో గీతారెడ్డికి కో ఆర్డినేటర్ పదవి రావడంతో కాంగ్రెస్ నాయకులు బుధవారం జహీరాబాద్‌లో టపాసులు పేల్చి స్వీట్లు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. గీతారెడ్డికి జాతీయస్థాయిలో అరుదైన పదవి దక్కడం ఆమె పనితనానికి నిదర్శనమని పలువురు ప్రశంసిస్తున్నారు.

40 లీటర్ల నీలి కిరోసిన్ పట్టివేత



అధికారులు స్వాధీనం చేసుకున్న నీలి రంగు కిరోసిన్ క్యాన్లు

మనోహరాబాద్ (తూప్రాన్): తూప్రాన్ మండలం ఇమాంపూర్ నుంచి మంగళవారం రాత్రి ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 40లీటర్ల నీలి రంగు కిరోసిన్ డబ్బాలను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మనోహరాబాద్ మండలం రామాయపల్లి శివారులో వాహనాన్ని వెంబడించి పట్టుకున్నారు. అధికారులను చూసిన ఆటో డ్రైవర్ అందులోని డబ్బాలను కిందకు దింపి పారిపోయారు. ఇమాంపూర్ రేషన్ డీలర్ అక్రమంగా నీలి రంగు కిరోసిన్‌ను తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. కిరోసిన్‌ను స్వాధీనం చేసుకొని రామాయపల్లి పంచాయతీ భవనంలో భద్రపరిచినట్లు మనోహరబాద్ డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాస్ తెలిపారు. రేషన్ డీలర్‌పై చర్య తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

పొన్నాలలో నెమలి మృతి



మృతిచెందిన నెమలి

సిద్దిపేట అర్బన్: సిద్దిపేట మండలం పొన్నాలలో జాతీయ పక్షి నెమలి విషగుళికలు తిని మృతిచెందింది. పొన్నాల మదిర బట్టరామన్నపల్లిలో ఓ చేనులో పడివున్న నెమలిని గమనించిన అంగన్‌వాడీ టీచర్ ఫారెస్టు అధికారులకు సమాచారమివ్వగా, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్యాంసుందర్ వచ్చి నెమలిని పరిశీలించి చేనులో చల్లిన విషగుళికలు తినడంవల్లే మరణించి ఉంటుందని చెప్పారు.

ట్రాక్టర్ ఢీకొని వృద్ధురాలి మృతి

మెదక్ క్రైం: ట్రాక్టర్ ఢీకొని వృద్ధురాలు మృతిచెందిన సంఘటన బుధవారం మెదక్‌లో చోటు చేసుకుంది. బంధువుల కథనం ప్రకారం పట్టణానికి చెందిన వీరమళ్ళి అనసూయ(65) బోరంచమ్మ గుడి వెనకగల ఇంటికి వెళ్లే క్రమంలో రోడ్డు దాటుతుండగా ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడింది. చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయంలో చోరీ





దుండగులు పగులగొట్టిన ఆలయ ప్రధాన ద్వారం తాళం, హుండీ

- 20 రోజుల క్రితం భక్త మార్కండేయ ఆలయంలో పంచలోహ విగ్రహాల అపహరణ
- వరుస చోరీలతో భయాందోళనలో జనం

కోహెడ: మండలంలోని శ్రీరాములపల్లి రేణుకా ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బుధవారం పూజారి శ్రీనివాస్, గౌడ సంఘం నేత బాలయ్య ఆలయానికి వెళ్లారు. ప్రధాన గేటుకు ఉన్న తాళం పగిలిపోయి ఉండడాన్ని గమనించారు. లోపలికెళ్లి చూడగా హుండీ తాళం పగులగొట్టి అందులో ఉన్న నగదును దొంగలు అపహరించుకు పోయినట్లు గుర్తించారు. సుమారు రూ. 10 వేలకు పైగానే హుండీలో నగదు ఉంటుందని పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నారు.

ఇదిలా ఉండగా 20 రోజుల క్రితం ఇదే గ్రామంలోని భక్త మార్కండేయ ఆలయంలో పంచలోహ విగ్రహాలను దుండగులు ఎత్తుకెళ్లారు. దవీంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. పోలీసులు నిఘా ఉంచాలని పలువురు కోరారు.

అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలని ఫిర్యాదు

నర్సాపూర్: పట్టణంలోని శివాలయం వెనుక భాగంలో ఉన్న విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని, అందులో నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు కొందరు బుధవారం ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని సర్వే నెంబరు 76 ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో కొందరు తమకు అనుమతులు ఉన్నాయంటూ భవన నిర్మాణం చేస్తుండడంతో స్థానికులు బుధవారం ఆర్డీవో కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అనంతరం పలువురు విలేకరులతో మాట్లాడుతూ సర్వే నెంబరు 76లో గోశాల ఏర్పాటు చేస్తానని తనకు మార్కెట్ ధరకు భూమి కేటాయించాలని ఓ వ్యక్తి అధికారులకు దరఖాస్తు చేసుకోగా గోశాలకు అవసరమైన రెండు ఎకరాల భూమి లేనందున ఇవ్వలేమని రెండు సంవత్సరాల క్రితమే అధికారులు లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారని తెలిపారు. అయితే సదరు వ్యక్తి ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేకున్నా ప్రభుత్వ భూమిలో 15గుంటలు ఆక్రమించి అందులో భవన నిర్మాణం చేస్తుండడమే కాకుండా ప్లాట్లుగా చేసి విక్రయించ డానికి యత్నిస్తున్నాడని ఆరోపించారు. ఎంతో విలువైన ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మాణం చేపడుతున్నా ఈ భూమిని స్వాధీనం చేసుకుని ప్రభుత్వ అవసరాలకు వినియోగించాలని వారు కోరుతున్నారు.

సర్వే చేస్తాం: తహసీల్దార్

ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మాణం చేస్తున్నారంటూ వచ్చిన ఫిర్యాదు మేరకు సర్వే చేయించి ఆక్రమణ నిజమైతే తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి తెలిపారు. ప్రభుత్వ భూమిని ఎవరు ఆక్రమించినా ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఎక్కడైనా ప్రభుత్వ భూమిని ఆక్రమించినట్లు గుర్తిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

శతాధిక వృద్ధురాలు మృతి

నారాయణఖేడ్: శతాధిక వృద్ధురాలు నెనావత్ బోజీబాయి(101) బుధవారం సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం అబ్బెంద కింది తండాలో మృతిచెందింది. బోజీబాయికి నలుగురు కుమారులు, ముగ్గురు కూతుళ్లు, మనుమళ్లు, మనుమరాళ్లు, మునిమనుమలు, మునిమనుమరాళ్లు కలిపి వంద మందికి పైగా కుటుంబసభ్యులున్నారు. బోజీబాయి సంపూర్ణ ఆరోగ్యంతో ఉందని తన పనులు తానే చేసుకునేదని పక్క కూడా పోయి మళ్లీవచ్చాయన్నారు. మృతి చెందడానికి కొద్ది సేపు ముందు కూడా భోజనం చేసిందని ఇంత వయస్సులోను ఆమె జొన్న రొట్టె కూడా తినేదని కుటుంబసభ్యులు తెలిపారు. బోజీబాయి అంత్యక్రియలు తండా శివారులో నిర్వహించారు.

ఆసుపత్రులలో దరఖాస్తులకు ఆహ్వానం

సిద్దిపేట కల్చరల్: సిద్దిపేట జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులలో తాత్కాలిక పద్ధతిన ఔట్ సోర్సింగ్ కింద పనిచేయుటకు ఎంబీబీఎస్ అర్హత కలిగిన వైద్యుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ప్రవీణ్‌చందర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 14 పోస్టులున్నాయని, మహిళా వైద్యులకు ప్రాధాన్యమిస్తామని ఆయన పేర్కొన్నారు. దరఖాస్తులను సిద్దిపేట జిల్లా కేంద్రంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో ఈ నెల 7లోపు సమర్పించాలని ఆయన సూచించారు.

ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన వ్యక్తిపై కేసు

వట్‌పల్లి: ప్రేమించి మోసగించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధజతురాలు ఫిర్యాదు చేసినట్లు స్థానిక ఎస్.ఐ. గణేష్ తెలిపారు. ఘటనకు సంబంధించి ఎస్.ఐ తెలిపిన వివరాలు వట్‌పల్లికి చెందిన యువతి ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న సమయంలో గట్‌పల్లి గ్రామానికి చెందిన సీనియర్ విద్యార్థి సుభాష్‌తో పరిచయం ప్రేమగా మారింది. వీరిద్దరు తరుచూ ఫోన్‌లలో మాట్లాడుకుంటూ, ప్రస్తుతం సుభాష్ సంగారెడ్డిలో డిగ్రీ చదువుతుండగా రహస్యంగా కలుసుకుంటున్నారు. కొంత కాలంగా తనను పెళ్లి చేసుకోవడం అనుకుంటు సుభాష్ ఫోన్ స్విచ్ ఆఫ్ పెట్టి ముఖం తప్పించుకొని తిరుగుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనితో మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు బుధవారం వట్‌పల్లి పోలీసులను ఆశ్రయించి బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ.గణేష్ తెలిపారు.

పాముకాటుతో బాలుడి మృతి



రోదిస్తున్న కుటుంబీకులు

సిర్గాపూర్: మండల కేంద్రమైన సిర్గాపూర్ పరిధిలోని సింగార్ బొగుడ తండాకు చెందిన సోనీబాయి, వెంకట్‌ల కుమారుడు చింటు(8) బుధవారం ఉదయం పాముకాటుతో మృతి చెందాడు. చింటు సిర్గాపూర్‌లోని వివేకానంద స్కూల్‌లో చదువుకుంటున్నాడు. రోజూ మాదిరిగానే పాఠశాలకు సిద్ధమై మూత్ర విసర్జన కోసం ఇంటి వెనకకు వెళ్లగా పాముకాటు వేసింది. ఆసుపత్రికి తరలించేలోపే బాలుడు మృతి చెందాడు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

చిన్నకోడూరు: ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బుధవారం చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్‌లో జరిగింది. ఎస్ఐ అశోక్ కథనం ప్రకారం.. కనకయ్య(46) ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యే వాడు. ఉన్న అర ఎకరంలో పత్తి పంట వేశాడు. అప్పులు ఉండడం, కుటుంబ పోషణ భారం కావడంతో తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, కొడుకు, కూతురు అన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

ఎస్‌జీఎఫ్ సెలక్షన్స్ షెడ్యూలు విడుదల

సంగారెడ్డి అర్బన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా క్రీడల షెడ్యూలును విడుదల చేసినట్లు ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మధుసూదన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 15వ తేదీ వరకు మండల స్థాయిలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించి ఆయా మండలాల జట్లను జిల్లాస్థాయిలో నిర్వహించే పోటీలకు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. 18నుంచి 30వ తేదీ వరకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలతోపాటు మిగతా క్రీడలకు జిల్లాస్థాయిలో ఎంపిక చేయాలని సూచించారు. వచ్చే నెల 1నుంచి 15వ తేదీ వరకు ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి వివిధ జట్ల ఎంపికలు నిర్దేశించిన స్థలాల్లో నిర్వహించబడుతాయని తెలిపారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హులని పేర్కొన్నారు. నవంబర్‌లో అండర్-14 కరాటే బాలబాలికల జాతీయ పోటీలు, నవంబర్ ఆఖరులో అండర్-14, 17, 19 బాలబాలికలకు కరాటేలో రాష్ట్రస్థాయి పోటీలుంటాయని తెలిపారు. అక్టోబర్‌లో అండర్-17 బాలుర క్రికెట్ రాష్ట్రస్థాయి పోటీలు జిల్లాలో నిర్వహించబడుతాయని ఆయన పేర్కొన్నారు.

డేంజర్ స్పాట్‌కు మోక్షం

- నాగులపల్లి హైవే చౌరస్తాకు అండర్‌బ్రిడ్జి నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్
- రూ.34.35 కోట్లు మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం
- టెండర్ ప్రక్రియ పూర్తయితే పనులు మొదలు

తూప్రాన్‌రూరల్: రోడ్డు ప్రమాదాలకు కేంద్ర బిందువుగా మారి డేంజర్ స్పాట్‌గా పేరు తెచ్చుకున్న తూప్రాన్ సమీపంలోని హైవే బైపాస్ రోడ్డు మార్గంలో ఉన్న నాగులపల్లి చౌరస్తాకు ఎట్టకేలకు మోక్షం లభించింది. పోలీసు ఉన్నతాధికారులు, హైవే అధికారుల నివేదికలు, సీఎం చొరవ, పార్లమెంటు సభ్యుడి పట్టుదల ఫలితంగా చౌరస్తా వద్ద అండర్ బ్రిడ్జిని నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల రూ.34.35 కోట్ల నిధులను మంజూరు చేసింది. మొదట్లో హైవే ఇంజనీరింగు అధికారులు తయారు చేసిన తప్పుడు డిజైన్ వల్ల ఇపుడు హైవే బైపాస్ రోడ్డు మార్గంలో మరమ్మతులకి అదనపు నిధులను కేటాయించడం తప్పనిసరయింది. 13 యేళ్ల క్రితం తూప్రాన్ మీదుగా ఉన్న జాతీయ రహదారి విస్తరణ కోసం బైపాస్ రోడ్డును నిర్మించారు. తూప్రాన్ నుంచి కామారెడ్డి వరకు నిర్మాణం జరిగింది. అయితే అప్పట్లో ఇంజనీరింగు అధికారులు సరైన డిజైన్ చేయకపోవడంతో నాగులపల్లి చౌరస్తా రోడ్డు ప్రమా దాలకు నిలయంగా మారింది. హైవే దారిలో స్పీడుగా వెళ్లే వాహనాలు, అడ్డంగా రోడ్డును దాటుతున్న వాహనాలు ఢీకొని ఘోర ప్రమాదాలు జరిగిపోతున్నాయి. బైపాస్ రోడ్డు వేసినప్పటినుంచి లెక్కకు మించిన ప్రమా దాలు జరిగి ఎందరో మృత్యువు పాలయ్యారు. మరి కొందరు క్షతగాత్రులయ్యారు. హైవే పొడవునా మేడ్చల్ నుంచి నాగపూర్ వరకు చూస్తే ఇంతటి డేంజర్ చౌరస్తా మరెక్కడా లేదు. తూప్రాన్ నుంచి వెల్దుర్తి వైపు వెళ్లాలంటే చౌరస్తాను దాటాల్సిందే. నిత్యం వందలాది వాహనాలు, స్కూలు బస్సులు బైపాస్‌రోడ్డును దాటి పోతుంటాయి. ఈ క్రమంలో రోడ్డును దాటుతున్న వాహనాలకు స్పీడుగా హైవేపై వెళ్లే వాహనాలు అదుపుతప్పి ఢీకొంటున్నాయి. నెలలో ఐదు ప్రమాదాలైనా ఈ చౌరస్తా వద్ద జరుగుతుంటాయి. స్థానిక పోలీసు స్టేషన్‌లో నమోదవుతున్న యాక్సి డెంట్ కేసుల్లో ఎక్కువగా ఈ స్పాట్‌లో జరిగినవే. పదమూడేళ్లలో వందల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు జరిగి దాదాపు 50మంది మృతి చెందారు. 150 మందికి పైగా గాయాలతో బాధపడుతున్నారు. చౌర స్తా వద్ద ప్రమాదాల సంఖ్య పెరుగుతుండటంతో హైవే అధికారుల్లో కదలిక మొదలయింది. మరోవైపు పోలీసులు ఇక్కడ నెలకొన్న ప్రమాదకర పరిస్థితులను వివరిస్తూ తమ నివేదికలను పంపారు. ఇక్కడ అండ ర్ బ్రిడ్జిని తప్పనిసరిగా నిర్మించాలని ప్రతిపాదనలు చేశారు. పలుసార్లు పోలీసు, హైవే ఉన్నతాధికారులు చౌరస్తాను సందర్శించి అండర్ బ్రిడ్జి నిర్మాణంపై సాధ్యాసాధ్యాల గురించి చర్చించారు. ఇంజనీరింగు అధికారులు కూడా వచ్చి స్పాట్‌ను పరిశీలించారు. ఈ అంశం సీఎం కేసీఆర్ దృష్టికి వెళ్లింది. తన నియోజకవర్గం పరిధిలోనే నాగులపల్లి చౌరస్తా ఉన్నందున చొరవ తీసుకొని అండర్ బ్రిడ్జి నిర్మాణం ఆవశ్యకత గురించి కేంద్ర జాతీయ రహదారుల శాఖ మంత్రి దృష్టికి తీసుకుపోయారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవాలని కోరారు. మెదక్ ఎంపీ ప్రభాకర్‌రెడ్డి సైతం పలుమార్లు అధికారులను ఇక్కడికి తీసుకొచ్చి ప్రమాదకర చౌరస్తాను చూపించారు. అండర్ బ్రిడ్జి నిర్మాణం నిధుల కోసం తీవ్రంగా ప్రయత్నించారు. రెండేళ్లుగా ఈ ప్రయత్నం జరగగా, ఎట్టకేలకు కేంద్రం బ్రిడ్జి ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నెల రోజుల క్రితమే అండర్ బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.34.35 కోట్ల నిధులను మంజూరు చేసింది. సమీపంలోని మాసాయిపేట గ్రామంలో సర్వీస్ రోడ్డు నిర్మాణానికి కూడ ప్రత్యేక నిధులు మంజూరయ్యాయి. హైవే దారిలోనే ఉన్న నార్సింగి, జప్తిశివనూరు, మాసాయిపేట ప్రాంతాల్లో అండర్ బ్రిడ్జిల నిర్మాణాలకు త్వరలోనే నిధులు మంజూరుకానున్నాయి. నాగులపల్లి చౌరస్తాలో బ్రిడ్జి పనులపై ప్రస్తుతం టెండర్ ప్రక్రియ జరుగుతోంది. ఇది పూర్తయితే ఇక నిర్మాణం పనులు వేగంగా జరుగనున్నాయి. పనులు మొదలయితే యేడాదిలోనే బ్రిడ్జి పూర్తవుతుందని హైవే అధికారులు తెలిపారు. అండర్‌బ్రిడ్జి మంజూరయిందని తెలిసి తూప్రాన్, వెల్దుర్తి ప్రాంతాలకు చెందిన ప్రజలు సంతోషం వ్యక్తపరిచారు. ఎపుడెపుడా అని ఎదురుచూస్తున్నారు.

మార్కెట్ గోదాములను పరిశీలించిన ట్రైనీ ఐఏఎస్‌లు



చేగుంటలో గోదాములను పరిశీలిస్తున్న ట్రైనీ ఐఏఎస్‌లు

చేగుంట: మండల కేంద్రమైన చేగుంటలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో నిర్మించిన గోదాములను బుధవారం ట్రైనీ ఐఏఎస్‌లు పరిశీలించారు. చేగుంట వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఆవరణలో నాబార్డు నిధులతో 5వేల మెట్రిక్ టన్నుల గోదాము, రెండువేలన్నర మెట్రిక్ టన్నుల గోదాములను నిర్మించగా ట్రైనీ ఐఏఎస్‌లు సచిన్, జోగిందర్‌సింగ్, హక్కిత పరిశీలించారు. గోదాముల నిర్మాణం వల్ల ఏయే పంటలను భద్రపరుస్తున్నారు. ఏరకమైన ఉపయోగం ఉంటుందన్న విషయాన్ని మార్కెటింగ్ శాఖ అధికారులనడిగి తెలుసుకున్నారు. ఏడాది పాటు ఆహార ధాన్యాల నిల్వలను మార్కెట్‌శాఖ గోదాముల్లో ఉంచుతున్నట్లు వారికి తెలియజేశారు. క్షేత్రస్థాయిలో గోదాముల నిర్మాణం వల్ల రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్న విషయాన్ని ట్రైనీ ఐఏఎస్‌లకు మార్కెటింగ్‌శాఖ జేడీ రవికుమార్, ఈఈ గోవర్ధన్‌రెడ్డి తెలియజేశారు. ప్రతి మండలకేంద్రంలో ప్రభుత్వం మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో గోదాములను నిర్మించడానికి ప్రయత్నాలు చేస్తున్న విషయాన్ని వారి దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం మూడో విడత హరితహారంలో భాగంగా మార్కెట్‌కమిటీ ఆవరణలో ట్రైనీ ఐఏఎస్‌లు మొక్కలను నాటారు. పరిశీలన కార్యక్రమంలో ట్రైనీ ఐఏఎస్‌లు సచిన్, జోగిందర్‌సింగ్, హక్కిత వెంట చేగుంట వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ సుజాత, మార్కెట్ కమిటీ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల కోసమే విద్యార్థులకు శిక్షణ : డీఈవో



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో

మెదక్ అర్బన్: పదో తరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా విద్యాశాఖ చర్యలు చేపట్టింది. వందేమాతరం ఫౌండేషన్ సహాయంతో లిటిల్ టీచర్ - లిటిల్ లీడర్ అనే నినాదానికి శ్రీకారం చుట్టింది. ప్రతి పాఠశాల నుంచి 4 నుంచి 10 మంది ఏ-గ్రూప్ విద్యార్థులకు మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. బుధవారం వైటీసీ భవన్‌లో నిర్వహిస్తున్న శిక్షణ డీఈవో సరోజినీదేవి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. జిల్లాలోని 163 ఉన్నత పాఠశాలలో 8,754 మంది విద్యార్థులుండగా వివిధ పాఠశాలల నుంచి 430 మంది 'ఉత్తమ ఉపాధ్యాయ' అవార్డుకు దరఖాస్తులు చేసుకోండి

రుబెల్లా టీకాపై అవగాహన కల్పించాలి : డీఈవో

జిల్లాలోని అన్ని పాఠశాలల పరిధిలో గురువారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించాలని డీఈవో సరోజినీదేవి ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. ఈనెల నుంచి రుబెల్లా టీకా ఇవ్వనున్నందున దానిపై అవగాహన కల్పించాలన్నారు. మధ్యాహ్నం 12.15 నుంచి ఒంటి గంట వరకు 'మన టీవీ'లో వృక్షా రక్షా బంధన్‌పై ప్రత్యేక ప్రసారం ఉన్నందున ఏకోక్లబ్ విద్యార్థులు, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొనాలని సూచించారు.

'ఉత్తమ ఉపాధ్యాయ' అవార్డుకు దరఖాస్తు చేసుకోండి

మెదక్: ఉత్తమ ఉపాధ్యాయ రాష్ట్రస్థాయి అవార్డుకు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా విద్యాశాఖ అధికారి సరోజినీదేవి ఉపాధ్యాయులకు సూచించారు. 2017 సెప్టెంబర్ 5, నేషనల్ ఫౌండేషన్ ఫర్ టీచర్స్ అవార్డుకు ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఎయిడెడ్, రెసిడెన్షియల్ స్కూళ్ల ఉపాధ్యాయులు దరఖాస్తులు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. 20 ఏళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న వారు దరఖాస్తుకి అర్హులని తెలిపారు. వర్కింగ్ టీచర్స్ హెడ్ మాస్టర్లు, రిటైర్డ్ టీచర్లు, రిటైర్డ్ హెడ్‌మాస్టర్లకు గైడ్‌లైన్స్‌ను మండల విద్యాధికారులకు పంపించినట్లు తెలిపారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉపాధ్యాయులు ఎంఈవో ద్వారా ఉన్నతపాఠశాల ఉపాధ్యాయులైతే హెచ్ఎం ద్వారా ప్రధానోపాధ్యాయులు జిల్లా విద్యాశాఖాధికారిచే ధ్రువపర్చిన ప్రతిపాదనలు 4 లోపు డీఈవో కార్యాలయంలో అందించాలన్నారు.

వందశాతం మరుగుదొడ్లు తప్పనిసరి

- నిర్మాణాలకి అన్ని గ్రామాల్లో అందరూ సహకారం అందించాలి
- భుజరంపేట గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించిన కలెక్టర్ భారతిహోళికేరి



మరుగుదొడ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్

కౌడిపల్లి: అన్ని గ్రామాల్లో వందశాతం మరుగుదొడ్లను నిర్మించుకోవాలని జిల్లా కలెక్టర్ భారతి హోళి కేరి భుజరంపేట గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించారు. బుధవారం కౌడిపల్లి మండల పరిధిలోని భుజరంపేట, మహ్మద్‌నగర్ గ్రామాల్లో కలెక్టర్ పర్యటించారు. రెండు గ్రామాల్లో వందశాతం మరుగుదొడ్ల నిర్మాణానికి అందరూ చేయూతనివ్వాలని ప్రతిజ్ఞ చేయించారు. ఆమె మాట్లాడుతూ.. ఇంటింటికి డస్ట్‌బిన్‌లను వినియోగించి, డంప్‌యార్డులకు చెత్త చెదారాన్ని తర లించాలన్నారు. వందశాతం మరుగుదొడ్ల నిర్మాణం తోనే గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్యం సాధ్య పడుతుందన్నారు. బహిరంగ మల విసర్జన చేయకుండా మరుగుదొడ్లు నిర్మించుకోవాలన్నారు. బడి మానేసిన విద్యార్థులందరినీ బడిలో చేర్పించే విధంగా అందరూ కృషిచేయాలన్నారు. సంపూర్ణ పారిశుధ్యం పాటిస్తేనే అందరి ఆరోగ్యాలు మెరుగు పడుతాయన్నారు. అన్ని గ్రామాల్లో డంప్ యార్డులను ఏర్పాటు చేసుకొని చెత్తనంతా ఇంట్లో డస్ట్‌బిన్‌లను వినియోగించి ఒకే చోటకు చేర్చాలన్నారు. గ్రామాభివృద్ధి మెరుగుపడాలంటే ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వందశాతం హరితహారాన్ని పూర్తి చేయాలన్నారు. ఇదిలా ఉండగా భుజరంపేట గ్రామ పంచాయతీ ఆవరణలో కలెక్టర్ 30 మొక్కలను నాటారు. ఆయా గ్రామాల్లో ఇంటింటా పర్యటించి గ్రామస్థులందరికి అవగాహన కల్పించాలన్నారు. మరుగుదొడ్ల నిర్మాణంతోనే అందరి ఆరోగ్యాలు మెరుగు పడుతాయని వివరించారు. వీరి వెంట డీపీవో హనూక్, ఆర్డీవో వెంకటేశ్వర్లు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

చెట్లుంటేనే మానవాళికి మనుగడ

- చెట్లను పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలి : కలెక్టర్ భారతి హోళికేరి

కొల్చారం: ప్రభుత్వం తీసుకున్న హరితహార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ భారతి హోళికేరి అన్నారు. బుధవారం కొల్చారం మండల పరిధిలోని రంగంపేట గ్రామంలో గడికోటలో మొక్కలను నాటారు. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ.. మెదక్ జిల్లాలో వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారని అందుకు వర్షాలు లేకపోవడంతో రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి, వర్షాలు కురిసే విధంగా ప్రత్యేక చొరవ చూపాలని పేర్కొన్నారు. అన్నీ గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలకు మొక్కలపై అవగాహన కల్పించి, గ్రామాల్లో మొక్కలు నాటే విధంగా కృషి చేయా లని పేర్కొన్నారు. చెట్లతో మానవాళికి మనుగడ ఉంటుందని అన్నారు. హరితహారంలో మెదక్ జిల్లా మొదటి స్థానంలో ఉండే విధంగా ప్రత్యేక చొరవ చూపాలని తెలిపారు. అనంతరం రంగంపేట సొసైటీ కార్యాలయం వద్ద చెట్లను నాటారు. ఎంపీపీ అరిగె రజిణి, జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఆప్ కో డైరెక్టర్ అరిగె రమేశ్ సంగాయిపేట నుంచి దుంపల కుంట వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు రెండున్నరేళ్ల నుంచి జరగకపోవడంతో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి ఆమె సానుకూలంగా స్పందించారు.



రంగంపేటలో మొక్కను నాటుతున్న కలెక్టర్

చెరువుల్లో చేపపిల్లలను వదలండి

- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి తలసాని ఆదేశం
- జిల్లాలో 4.58 కోట్ల చేపపిల్లల పంపిణీకి చర్యలు
- కలెక్టర్ భారతిహోళికేరి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి తలసాని యాదవ్

మెదక్: జిల్లా వ్యాప్తంగా జలాశయాల్లో చేపపిల్లల విడుదలకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ సూచించారు. బుధవారం హైదరాబాద్ నుంచి చేపపిల్లల పెంపకం, గొర్రెల పంపిణీపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.. గడిచిన సంవత్సరం మత్స్యకార సొసైటీలున్న గ్రామాల్లో మాత్రమే చేపపిల్లలను విడుదల చేశామని, ఈ యేడు ఎక్కువ కాలం నీరు నిల్వ ఉండే లోతైన చెరువులు, కుంటల్లో చేపపిల్లల విడుదలకు చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు సూచించారు. మత్స్యకారులు, ముదిరాజ్ కుటుంబాల్లో ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ఉచితంగా చేపపిల్లలను పంపిణీ చేస్తోందన్నారు. విడుదల చేసే సమయంలో ప్రజాప్రతినిధులను, సొసైటీ సభ్యులను భాగస్వాములను చేయాలని సూచించారు. వాటిని త్వరగా జలాశయాల్లోకి వదలకపోతే మృతిచెందే ప్రమాదముందని హెచ్చరించారు. కలెక్టర్ భారతిహోళికేరి మాట్లాడుతూ.. మెదక్ జిల్లాలో 4.58 కోట్ల చేపపిల్లలను పంపిణీ చేసేందుకు టెండర్ల ప్రక్రియ పూర్తయిందని మంత్రికి వివరించారు. ప్రస్తుతం 200 చెరువుల్లో విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు జిలాలో 907 గొర్రెల యూనిట్లను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు.

సోలార్ యాజమాన్యం నష్టపరిహారం చెల్లించాలి

- పంట భూముల్లో స్తంభాల వల్ల నష్టపోయాం
- కలెక్టరేట్ వద్ద రైతుల ఆందోళన: జేసీకి వినతి పత్రం



కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్న రైతులు

మెదక్ రూరల్: పంట భూముల్లో సోలార్ స్తంభాల వల్ల నష్టం వాటిల్లింది. కానీ సోలార్ యాజమాన్యం నష్టపరిహారం ఇవ్వడంలో అన్యాయం చేస్తున్నారంటూ ఆరోపిస్తూ బుధవారం జిల్లా కలెక్టరేట్ వద్ద రైతులు ఆందోళన నిర్వహించారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో 'అక్కడ అలా.. ఇక్కడే ఎందుకిలా?' అన్న కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో సోలార్ విద్యుత్ స్తంభాల వల్ల పంట పొలాలు నష్ట పోయిన బాధిత రైతులు సర్పంచుల ఫోరం ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సోలార్ యాజమాన్యం రైతులకు పరిహారం చెల్లించడంలో తీవ్ర వివక్ష చూపుతుందన్నారు. నిబంధనల ప్రకారం పంట భూముల డిమాండ్‌ను బట్టి నష్టపరిహారం చెల్లించాలని ఉన్నా జిల్లాలో పాటించడం లేదని పేర్కొన్నారు. కేవలం కొంత మందికే అధిక మొత్తంలో నష్టపరిహారం చెల్లిస్తూ అమాయక రైతులకు రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకే చెల్లించి చేతులు దులుపుకుంటున్నారన్నారు. సంగారెడ్డి జిల్లాలో ఇస్తున్న విధంగానే మెదక్ జిల్లాలోని రైతులకు కూడా నష్టపరిహారం అందజేయాలని కోరారు. లేకుంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ సురేశ్‌బాబుకు వినతి పత్రం అందజేశారు.

రేపు ఎస్టీయూ 70వ వసంతోత్సవం

జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

మెదక్ అర్బన్: 70 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం శుక్రవారం మెదక్ జిల్లాలో వసంతోత్సవం పండగను నిర్వహించనున్నట్లు ఎస్టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బొడ్ల శ్రీనివాస్, ప్రణీద్ కుమార్ తెలిపారు. బుధవారం ఎస్టీయూ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలోని ముఖ్య అతిథులుగా ఉపసభాపతి పద్మారెడ్డి, ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు భుజంగరావు, కార్యదర్శులు సదానందంగౌడ్ రానున్నట్లు తెలిపారు.

ఇక పశువులకూ బార్ కోడ్

- ఆధార్ నంబర్ల మాదిరిగా పశువులకు నంబర్లు
- ఉమ్మడి జిల్లాకు 10 వేల నంబర్లు కేటాయింపు
- ఏడాదికి లక్ష చొప్పున మూడేళ్లలో అన్ని ఊళ్లల్లో ట్యాగింగ్
- పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి రాంజీ

జోగిపేట: మనుషులకు ఆధార్ నంబర్ల మాదిరిగా పశువులకూ బార్ కోడ్‌లను కేటాయించనున్నామని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి రాంజీ అన్నారు. బుధవారం ఆయన, జోగిపేటలోని పశువైద్యశాఖ కార్యాలయంలో బార్‌కోడ్ నంబర్లపై గోపాల మిత్రలకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఉమ్మడి మెదక్ జిల్లాలో 3.42 లక్షల పాడి పశువులున్నాయని, ఏడాదికి లక్ష చొప్పున మూడేళ్ళలో వీటన్నిటికీ నంబర్ల కేటాయింపు జరుపుతామన్నారు. ప్రస్తుతానికి ఉమ్మడి జిల్లాకు కలిపి 10 వేల నంబర్లు కేటాయించారన్నారు. ప్రస్తుతం, పైలట్ ప్రాజెక్టు కింద ఉమ్మడి జిల్లాలోని హత్నూర, నారాయణఖేడ్ మండలాలను ఎంపిక చేశారన్నారు. జిల్లాకు కేటాయించిన 10 వేల నంబర్లను ఆ రెండు మండలాల్లోని పశువులకు కేటాయించి ఆన్‌లైన్ చేస్తామన్నారు. ఒక పశువుకు ఒక నంబరును కేటాయిస్తామని, అనంతరం, ఆధార్ కార్డు మాదిరిగా దాని యజమానిపేరు, చిరునామా, అతడి ఫోన్ నంబరు, పశువు వివరాలు, దాని ఆరోగ్య పరిస్థితి, వయసు, రంగు, తదితర విషయాలను ఆ నంబరుతో అనుసంధానించి, ఒక కార్డును తయారు చేస్తామన్నారు. ఈ నంబరుతో సదరు వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తామన్నారు. నంబరు కేటాయించిన పశువు చనిపోతే, ఆ నంబరు రద్దయిపోతుందన్నారు. ఆ నంబరును మరో పశువుకు కేటాయించే సమస్యే ఉత్పన్నం కాదన్నారు. ఒకవేళ సదరు పశువును ఇతరులకు అమ్మితే, యజమాని పేరు, అడ్రస్, ఫోన్ నంబరు మాత్రమే మారుతాయి తప్ప, పశువు నంబరు మారదన్నారు. ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయడంతో సదరు పశువు యొక్క ఆరోగ్య సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఫోన్ ద్వారా దాని యజమానికి పశువైద్య శాఖ సిబ్బంది, గోపాల మిత్రలు తెలియజేస్తారన్నారు.

పంద్రాగస్టుకూ పాత దుస్తులేనా?

- విద్యార్థులకు అందని యూనిఫాం
- మంత్రి మాటలు నీటి మూటలేనా?
- పాత, చినిగిన దుస్తులతోనే బడికి
- జెండా పండగకైనా విద్యార్థులకందేనా?

మెదక్ రూరల్: 'ఈ సారి దుస్తుల పంపిణీ ఆలస్యమైంది.. కానీ వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులందరికీ దుస్తులు పంపిణీ చేస్తామని మంత్రి హరీశ్‌రావు మార్చిలో మెదక్ మండలం రాజ్‌పల్లి పాఠశాల గదుల ప్రారంభోత్సవానికి వచ్చి విద్యార్థులకు ఇచ్చిన హామీ ఇచ్చారు.

విద్యాసంవత్సరం ప్రారంభం కాగానే విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందజేస్తామని సాక్షాత్తూ మంత్రి హామీ ఇచ్చినా జిల్లాలో నేటికి అందలేదు. గతేడు విద్యాసంవత్సరం చివరలో ఏకరూప దుస్తులు అందజేసి చేతులు దులుపుకున్నారు. విద్యాశాఖ ఈ సారి కూడా అదే ధోరణి సాగుతోంది. విద్యాసంవత్సరం ప్రారంభమై రెండు నెలలవుతున్నా ఇప్పటికీ ప్రభుత్వ పాఠశాలలకు యూనిఫాం అందలేదు. దీంతో విద్యార్థులు చినిగిన చొక్కాలతోనే బడి బాట పట్టాల్సి వస్తుంది. ఈ సారి పంద్రాగస్టుకైనా ప్రభుత్వం బట్టలు పంపిణీ చేస్తుందా? లేదా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. విద్యార్థులకు అందరూ సమానమేనన్న భావన కలిగించడం కోసం ప్రభుత్వం ఏటా విద్యాలయాలు 1 నుంచి 8వ తరగతి విద్యార్థులకు యూనిఫాంను పంపిణీ చేస్తుంది. జిల్లాలో 20 మండలాల పరిధిలో 897 ప్రభుత్వ పాఠశాలల్లో 71 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రభుత్వం ఏటా విద్యార్థులకు విద్యాసంవత్సరం ప్రారంభంలోనే రెండు జతల దుస్తులను అందజేస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో దుస్తుల పంపిణీ సక్రమంగా సాగినా రాష్ట్ర ఆవిర్భావం తర్వాత పంపిణీలో జాప్యం జరుగుతుంది. గతేడాది విద్యాసంవత్సరం చివరలో విద్యార్థులకు యూనిఫాంలను అందజేశారు. అయితే 2017-18 విద్యాసంవత్సరంలోనైనా ప్రారంభంలోనే అందజేస్తారని భావించినా జిల్లాలో అమలు కావడం లేదు. దీంతో ప్రభుత్వ పాఠశాలకు వచ్చే విద్యార్థులు పాత చినిగిన దుస్తులతోనే రావాల్సి వస్తుంది. అధికారులు నేడూ.. రేపూ అంటూ కాలం వెళ్లదీస్తున్నారే తప్ప ఇప్పటికీ అందించింది లేదు.


చినిగిన దుస్తుల్లో గిరిజన విద్యార్థి

20 మండలాల్లో ఒకే మండలానికి పంపిణి

జిల్లాలోని 20 మండలాల్లో కేవలం ఒకే మండలానికి ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. మెదక్ మండలం మినహా మిగతా ఏ మండలానికి ఇప్పటి వరకు యూనిఫాం అందలేదు. అందులోనూ బుధవారం నుంచి మెదక్ మండలంలో పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. 20 మండలాల్లో 1.42 లక్షల దుస్తులు పంపిణీ ఎప్పటివరకు పూర్తి చేస్తారా? అన్నది అధికారుల నుంచి పూర్తి సమాచారం రావడం లేదు. అన్ని స్కూళ్లకు పంపిణీ చేస్తామంటున్నారే తప్ప ఎప్పటి వరకు పూర్తి చేస్తామన్నది స్పష్టత లేదు.

పాఠశాలలకు దుస్తులు చేరేనా?

పంద్రాగస్టు దగ్గర పడుతుండడంతో ప్రభుత్వ పాఠశాలకు అన్నింటికీ దుస్తుల పంపిణీ పూర్తయ్యే పరిస్థితులు కనిపించడం లేదు. స్కూళ్లు ప్రారంభమై 50 రోజులు గడుస్తున్నా నేటికి ఒక మండలానికి కూడా పూర్తి స్థాయిలో పంపిణీ జరగలేదు. మిగతా 19 మండలాల్లో పూర్తి చేయాలంటే మరో నెల పాటు సమయం పట్టే అవకాశాలున్నాయి. అధికారులు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసి స్కూల్ ప్రారంభంలోనే ఏకరూప దుస్తులు సిద్ధం చేసి ఉంటే ఈ సమస్య వచ్చేది కాదు.

ఒకే ఏజెన్సీ వల్ల ఆలస్యం

విద్యార్థుల యూనిఫాం కుట్టేందుకు ఒకే ఏజెన్సీకి అప్పగించడం వల్ల ఆలస్యం జరుగుతున్నట్లు తెలుస్తుంది. గతంలోనే ఓ ప్రైవేటు కంపెనీకి యూనిఫాం కుట్టడం కోసం మెదక్‌లోని ఓ ఏజెన్సీకి అప్పగించారు. జిల్లాలోని అన్ని పాఠశాలకు చెందిన 1.42 లక్షల దుస్తులు కుట్టడానికి ఇచ్చారు. దీంతో పాటు ఆ ఏజెన్సీకి కామారెడ్డి ఇతర జిల్లాల కూడా ఉండడంతో కుట్టడంలో ఆలస్యమవుతున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. ఒక్కో మండలానికి పంపిణీ చేసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మండలాలకు ఇలా వంతుల వారీగా పంపిణీ చేస్తే జిల్లాలో దుస్తుల పంపిణీ మరో నెల పట్టే అవకాశం ఉంది.

నాలుగు రోజుల్లో అందరికీ దుస్తులు

- నాగేశ్వర్, జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి

జిల్లాలోని అన్ని పాఠశాలలకు నాలుగు రోజుల్లోగా యూనిఫాం పంపిణీ పూర్తి చేస్తాం. మెదక్ మండలంలో దుస్తుల పంపిణీ దాదాపు పూర్తయింది. మిగతా అన్ని మండలాలకు మరో నాలుగు రోజుల్లో పంపిణీ చేస్తామన్నారు. జిల్లా కలెక్టర్ చేత విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేసే కార్యక్రమాన్ని చేపడుతున్నాం. ఆగస్టు 15వరకు విద్యార్థులంతా కొత్త బట్టలే వేసుకుంటారు.

'వినియోగదారుడి'పై గుదిబండ

- ప్రతి నెలా రూ. 4 పెరగనున్న సిలిండర్ ధర
- సబ్సిడీని తొలగించేందుకు కేంద్రం నిర్ణయం
- జిల్లాలో 1, 55, 917 గ్యాస్ కనెక్షన్లు
- ఏటా రూ. 74.84 లక్షల భారం

మెదక్ అర్బన్: వంటగ్యాస్ రాయితీని క్రమంగా ఎత్తివే యాలన్న కేంద్రం నిర్ణయం జిల్లాలో తీవ్ర ప్రభావం చూపనుంది. ప్రతి నెల రూ. 4కు పెంచాలని నిర్ణయించడం, మార్చి తర్వాత రాయితీ లేకుండా పూర్తి ధరతో సిలిండర్‌ను కొనుగోలు చేయాల్సి రావడంతో ఆయా వర్గా లపై అదనపు భారం పడనుంది. జిల్లాలో 1,55,917 కనెక్షన్లు ఉన్నాయి. వీరందరిపై రాయితీ ఎత్తివేత నిర్ణయం ఆర్థికంగా ఇబ్బందులు తెచ్చిపెట్టనుంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని వినియోగదారులపై తాజా నిర్ణయం చూపే ప్రభావంపై ప్రత్యేక కథనం..

సిలిండర్‌పై ప్రతి నెల రూ. 4 పెంపు ద్వారా సామాన్య, మధ్య తరగతి ప్రజలపై భారం పడనుంది. కేంద్ర ప్రభుత్వం సిలిండర్‌పై అందిస్తున్న సబ్సిడీ ఎత్తివేతకు ఈ నిర్ణయం తీసుకుంది. సబ్సిడీని పూర్తిగా తొలగించేందుకు సన్నాహాలు చేస్తుంది. ఇందులో భాగంగానే ధరను పెంచుతూ వస్తుంది. ప్రతి నెల రూ. 4 చొప్పున పెంచనున్నట్లు కేంద్ర ప్రభుత్వం సోమవారం ప్రకటించిన విషయం విదితమే. సబ్సిడీ ఎత్తివేతలో భాగంగానే గత ఏడాది జూలై నుంచి ప్రతి నెల రూ. 2 పెంచుతూ వచ్చిన ప్రభుత్వం ఇకపై ఆ మొత్తాన్ని రూ. 4కు పెంచింది. పెంపు వచ్చేనెల నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. జిల్లాలోని 20 మండలాల్లో మొత్తం 13 గ్యాస్ ఏజెన్సీ లు ఉన్నాయి. వీటి పరిధిలో దీపం పథకం కింద 46,722, సింగిల్ గ్యాస్ కనెక్షన్లు 35,144, డబుల్ కనెక్షన్లు 26,389 ఉన్నాయి. ప్రభుత్వం ఏడాదికి 12 సిలిండర్లను సబ్సిడీపై అందిస్తుంది. నెలకు రూ. 4 పెరిగిందనుకుంటే 1,55,917 కనెక్షన్లపై రూ. 6,23,668 భారం పడనుంది. ఇలా ప్రతి నెలా పెరగడంతో వినియోగదారులపై ఏడాదికి రూ. 74,84,016 భారం పడనుంది. ప్రతి నెల గ్యాస్ సిలిండర్ ధర పెరగడంతో వినియోగదారులపై భారం ఎక్కువ కానుంది. ప్రస్తుతం సిలిండర్ ధర రూ. 590 ఉంది. ఇందులో నుంచి ప్రభుత్వం రూ.93 సబ్సిడీ ఇస్తుంది. గ్యాస్ ధర పెంచడంతో భవిష్యత్తులో సామన్య, మధ్య తరగతి ప్రజలు గ్యాస్ వినియోగించని పరిస్థితులు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయి.



సబ్సిడీని వదిలించుకునే ప్రయత్నం

ప్రస్తుతం గ్యాస్ సిలిండర్‌పై ఇస్తున్న సబ్సిడీ సొమ్మును ప్రభుత్వం వదిలించుకునే ప్రయత్నం చేస్తోంది. మున్ముందు సబ్సిడీపై కాకుండా పూర్తి స్థాయి ధరకు సిలిండర్‌ను ఇచ్చే అవకాశాలు కనిపస్తున్నాయి. రానున్న రెండున్నర ఏళ్లలో సబ్సిడీని పూర్తిగా తొలగిపోయే అవకాశాలున్నాయని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సబ్సిడీ రూపంలోనే సిలిండర్‌ను అందించాలని వినియోగదారులు కోరుతున్నారు.

సబ్సిడీపై అందించాలి - మౌనిక, గృహిణి



సబ్సిడీ ఎత్తివేసే నిర్ణయాన్ని మానుకోవాలి. గ్యాస్ సిలిండర్‌పై ప్రతి నెలా రూ. 4 చొప్పున పెంచడంతో మాలాంటి మధ్యతరగతి వారికి ఆర్థికభారం పడుతుంది. సబ్సిడీపైనే సిలిండర్లను అందించాలి.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోండి

- వికలాంగుల, వయో వృద్ధుల సంక్షేమాధికారి జ్యోతి పద్మ

మెదక్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వేతర పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి చదువుతున్న వికలాంగ విద్యార్థులకు 2017-18కి గానూ ప్రీ మెట్రిక్ ఉపకార వేతనాల మంజూరికి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు జిల్లా మహిళా శిశు వికలాంగుల, వయో వృద్ధుల సంక్షేమాధికారి జ్యోతి పద్మ ఓ ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 5 వరకు నెలకు రూ.70 చొప్పున, 6 నుంచి 8 వరకు రూ.100, 9, 10వ తరగతి విద్యార్థులకు రూ.182 చొప్పున పది నెలలకు వికలాంగ విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించనున్నట్లు తెలిపారు. దరఖాస్తు ఫారం పూర్తిచేసి మెడికల్‌బోర్డు ధ్రువ పత్రం, ఆదాయ, కుల, నివాస ధ్రువపత్రాలు, ప్రతి సంవత్సరం చదివిన తరగతి మార్కుల జాబితా, వికలాంగత్వం కనిపించే ఫొటో జతపర్చాలని పేర్కొన్నారు. దీంతో పాటు దరఖాస్తును ప్రస్తుతం చదువుతున్న పాఠశాల హెచ్‌ఎంల ద్వారా సెప్టెంబర్ 30లోగా జిల్లాసంక్షేమాధికారి మహిళా శిశు వికలాంగుల వయోవృద్ధుల సంక్షేమశాఖ జిల్లా కార్యాలయానికి పంపాల్సిందిగా సూచించారు. దరఖాస్తు ఫారాల కోసం మెదక్, రామాయంపేట, నర్సాపూర్, అల్లాదుర్గ్ ఐసీడీఎస్ కార్యాలయాలు, మండల విద్యాధికారి కార్యాలయాలు, వికలాంగుల సంక్షేమశాఖ కార్యాలయాల్లో సంప్రదించాల్సిందిగా సూచించారు. 08452-223616కు ఫోన్ చేయొచ్చని తెలిపారు.

సినిమాలు

మెదక్		పెద్దశంకరంపేట		తూప్రాన్	
సినీమ్యాక్స్	ఫిదా	లక్ష్మి	బాహుబలి-2	వేంకటేశ్వర	గౌతమ్‌నంద
గంగినేని	గౌతమ్‌నంద	**నర్సాపూర్**		**రామాయంపేట**	
సాగర్	వాసుకి	సాయి	ఫిదా	సంతోష్	గౌతమ్‌నంద
		శ్రీనివాస	గౌతమ్‌నంద	సాయిరామ్	ఫిదా


రామాయంపేటలో దీక్షలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు

వర్గీకరణ కోరుతూ ఎమ్మార్పీఎస్ దీక్షలు

రామాయంపేట: ఈ పార్లమెంటు సమావేశాల్లోనే ఏబీసీడీ వర్గీకరణ బిల్లును పెట్టాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆందోళన చేపట్టింది. ఈ మేరకు బుధవారం స్థానిక ఎంపీపీ కార్యాలయం ఎదుట దీక్షలు చేపట్టారు. సుమారు రెండు దశాబ్దాలుగా ఈ సమస్యను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నాన్చుడు ధోరణి సరికాదన్నారు. ఇకనైనా ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో బిల్లు పెట్టాల్సిందిగా డిమాండ్ చేశారు. లేదంటే వచ్చే ఎన్నికల్లో తమ సత్తా చూపుతామని హెచ్చరించారు. ఈ దీక్షల్లో నర్సింలు, రాజయ్య, రాజు తదితరులు ఉన్నారు.

ముప్పారంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు

అల్లాదుర్గం : తల్లిపాల వారోత్సవాల సందర్భంగా బుధవారం అల్లాదుర్గం మండలంలోని ముప్పారం గ్రామంలో అంగన్‌వాడీ, పాఠశాలల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ఈ ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు రమాదేవి, లక్ష్మీబాయి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు ఆశా, ఏఎన్ఎం నవనీత తదితరులు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేటలో


పెద్దశంకరంపేటలో మాట్లాడుతున్న సర్పంచ్ జంగం శ్రీనివాస్

పెద్దశంకరంపేట : తల్లిపాలు ఎంతో శ్రేష్ఠమైనవి అని పెద్దశంకరంపేట, చీలపల్లి సర్పంచులు జంగం శ్రీనివాస్, మధుసూదన్ అన్నారు. బుధవారం పేట పూసలగల్లి, చీలపల్లిలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలలో వారు పాల్గొని మాట్లాడారు. పుట్టిన బిడ్డలకు వెంటనే తల్లిపాలు తప్పనిసరిగా తాగించాలన్నారు. వాటిలో అనేక పౌష్టిక విలువలు కలిగి ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో పేట మాజీ ఉప సర్పంచ్ మురళిపంతులు, అంగన్‌వాడీలు సరళ, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ అధ్యక్షుడుగా అంజిబాబు


అంజిబాబు

రేగోడు : పీఆర్టీయూ రేగోడుశాఖ మండల అధ్యక్షుడుగా అంజిబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం రేగోడులో జరిగిన పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం ఎన్నికలు జరిగాయి. ఉపాధ్యక్షుడుగా శ్రీనివాస్, కార్యదర్శిగా సంగమేశ్వర్, మహిళ ఉపాధ్యక్షులుగా స్వప్నలను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో మెదక్ జిల్లా అధ్యక్షుడు రాందాస్, ఎన్నికల అధికారి రవీందర్, సభ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలం యాదవ్, స్టివెన్‌సన్, లక్ష్మన్, తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన వంటశాల గదుల నిర్మాణం

- ఆరుబయటనే మధ్యాహ్న భోజనం

రేగోడు : ప్రభుత్వ పాఠశాలలో వంటగదుల నిర్మాణం నత్తనడకన సాగుతోంది. వంటగదులు లేక మధ్యాహ్న భోజనం ఆరుబయటే నిర్వహిస్తున్నారు. రేగోడు మండలంలో 14 పాఠశాలల్లో వంటగదులు లేవని ఉపాధిపథకం ద్వారా ఒక్కో వంటగది నిర్మాణానికి రూ. 2.50 లక్షలు నిధులను మంజూరు చేసింది. నిధులు మంజూరు జరిగి నెలలుగడుస్తున్నా నిర్మాణం పనులు సాగడం లేదు. వంటగదులు లేకపోవడంతో ఆరుబయట మధ్యాహ్న భోజనం నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. గజవాడ, ప్యారారం, కొత్వాన్‌పల్లి పాఠశాలల్లో నిర్మాణాలు జరుగుతుండగా రేగోడు ఉన్నత పాఠశాలలో పునాది స్థాయిలోనే నిలిచి పోయింది. టి. లింగంపల్లిలో వంటగదిలేక వర్షం పడితే మధ్యాహ్న భోజనం నిలిచి పోతుందని గ్రామస్థులు తెలిపారు.


రేగోడు ఉన్నత పాఠశాల వద్ద పునాది స్థాయిలో ఉన్న వంటశాల గది

వంటశాలకు నిధులు మంజూరైనా అధికారులు, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యంతో ముందుకు సాగడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఈ విషయమై ఏపీవో గంగారాంను ప్రశ్నించగా మండలంలో 14 పాఠశాలలకు వంటగదులు మంజూరు చేశారని, నిర్మాణాలు చేపట్టేందుకు కృషి చేస్తున్నామని అన్నారు.

చల్మెడలో మొక్కలు నాటిన ఎక్సైజ్‌శాఖ


చెరువు కట్టపై మొక్కకు నీరు పోస్తున్న ఎక్సైజ్ సీఐ, ఎస్ఐలు

రామాయంపేట: మొక్కల పెంపకంతోనే వాతావరణ కాలుష్యం తగ్గుతుందని రామాయంపేట ఎక్సైజ్ సీఐ రాధాకిషన్ పేర్కొన్నారు. బుధవారం నిజాంపేట మండలపరిధి చల్మెడ సోమయ్య చెరువుకట్ట... దాని సమీపంలో సుమారు 1600 మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలను నాటడమే కాదు వీటి సంరక్షణకు ప్రాముఖ్యం ఇవ్వాలని గ్రామస్థులను కోరారు. ఈ కార్యక్రమంలో చల్మెడ గ్రామ నాయకులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

హరితహారం, మరుగుదొడ్ల నిర్మాణం టార్గెట్ చేయాలి

- ఎంపీడీవో బస్వనప్ప

రేగోడు : ప్రభుత్వం చేపట్టిన హరితహారం, మరుగుదొడ్ల నిర్మాణం గ్రామాలకు ఇచ్చిన టార్గెట్‌లను పూర్తిచేయాలని ఎంపీడీవో బస్వనప్ప అన్నారు. బుధవారం రేగోడు మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ పథకం సిబ్బంది సమావేశంలో మాట్లాడారు. ప్రతి గ్రామపంచాయతీల నిర్మాణాలు వందశాతం చేయించాలని తెలిపారు. ఉపాధికూలీల జాబ్‌కార్డులకు, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ లింక్ లేనందునే కూలీ డబ్బులు రావడం లేదని అన్నారు. వెంటనే సరి చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో గంగారాం, టీఏలు నరేందర్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు ఉన్నారు.

వికలాంగ విద్యార్థులకు వైద్య పరీక్షలు

పెద్దశంకరంపేట : పెద్దశంకరంపేట మండల వనరుల కేంద్రం ఆవరణలో వికలాంగ విద్యార్థులకు బుధవారం ఫిజియో థెరపిస్టు వైద్యురాలు శ్రావణి వైద్యపరీక్షలను నిర్వహించారు. ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో ఉన్న వికలాంగ విద్యార్థులకు వైద్యపరీక్షలు ప్రతి వారం ఉచితంగా నిర్వహించబడుతాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బస్‌పాస్ కౌంటర్ ఏర్పాటుకు వినతి


మెదక్ డీఎంకు విన్నవిస్తున్న ఏబీవీపీ నేతలు

రామాయంపేట: రామాయంపేట ఆర్టీసీ బస్టాండ్‌లో విద్యార్థుల సౌకర్యార్థం బస్‌పాస్ కౌంటర్‌ను ఏర్పాటు చేయాల్సిందిగా ఏబీవీపీ నేతలు కోరారు. బుధవారం మెదక్ ఆర్టీసీ డిపో మేనేజర్‌కు ఏబీవీపీ రామాయంపేట ప్రాంత కార్యదర్శి శ్రీకాంత్ వినతిపత్రం అందజేశారు. ప్రతినిత్యం 2వేల మంది విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తారని, అందువల్ల ఇక్కడ కౌంటర్ ఏర్పాటు చేయాల్సిందిగా విన్నవించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో రాంసింగ్, మాణిక్‌రాజు ఉన్నారు.

విద్యాభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

- జడ్పీటీసీ సభ్యురాలు కంచరి మమతాబ్రహ్మం


భూమి పూజ చేస్తున్న కంచరి మమతాబ్రహ్మం

అల్లాదుర్గం : పాఠశాలల విద్యార్థులకు మౌలిక సదుపాయాలను కల్పిస్తూ విద్యాభ్యున్నతే ప్రధానలక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని అల్లాదుర్గం జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యురాలు కంచరి మమతా బ్రహ్మం అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్(బాలుర)ఉన్నత పాఠశాలలో వంటశాల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన జరుగుతుందని, వీటి ఫలితమే ఇటీవల వెలువడిన పదో తరగతి ఫలితాలని గుర్తు చేశారు. మండలంలోని పలు పాఠశాలల్లో వంటశాలల నిర్మాణం కోసం నిధులు మంజూరు కావడంతో ఈ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్న లక్ష్యంతో కృషి చేస్తున్నామని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు అనురాధ బల్‌రాం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధనుంజయగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'ఎంఈవోలను నియమించాలి'


డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

మెదక్ అర్బన్: మెదక్, హవేళీఘనపూర్ మండలాలకు ఎంఈవోలను నియమించాలని జిల్లా విద్యాశాఖాధికారి సరోజినీదేవికి జిల్లా పీఆర్టీయూ నేతలు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ జిల్లాప్రధానకార్యదర్శి మహేష్ మాట్లాడుతూ మండల విద్యాధికారులు లేనందున పీఆర్సీ, ఏరియర్స్ బిల్లులు, ఉపాధ్యాయ వేతన, మధ్యాహ్న భోజన బిల్లులు నిలిచిపోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సెలవులో ఉన్న ఉపాధ్యాయులు విధుల్లో చేరలన్నా కష్టంగా ఉందన్నారు. వెంటనే పై మండలాలకు మండల విద్యాధికారులను నియమించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణకాంత్, కార్యదర్శి శ్రీహరి, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, మెదక్ పట్టణ, మండల ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్, రామకృష్ణ, నాయకులు పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో అండగా ఉండేందుకే సీఎంఆర్ఎఫ్

- ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి పరిహారం అందజేత
- ఉపసభాపతి పద్మాదేవేందర్‌రెడ్డి



రైతు కుటుంబానికి రూ.5లక్షల చెక్కును అందజేస్తున్న ఉప సభాపతి పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: పేదప్రజలకు అండగా ఉండేందుకు ముఖ్యమంత్రిసహాయనిధి ద్వారా ఎప్పటి కప్పుడు స్పందిస్తున్నట్లు ఉప సభాపతి పద్మాదేవేంద ర్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఆమె క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పదిమంది లబ్ధిదారులకు మంజూరైన రూ. 2లక్షల 3 వేల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. వీటితో పాటు మెదక్‌మండలం రాజ్‌పల్లిగ్రామంలో అప్పుల బాధతో మృతిచెందిన రైతు మారోత్ బన్సి కుటుం బానికి రూ. 5లక్షల చెక్కును నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో కలిసి అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పేదప్రజల అత్యవసరచికిత్సకోసం పెద్ద ఆస్పత్రుల్లో చేరి ఇబ్బందులు పడ్డ వారికి సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆదుకోవడం జరుగుతుందన్నారు. ఈ ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే సాధ్యమైందన్నారు. అనంతరం ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీ ఆర్ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తు న్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ రాష్ట్రకార్యదర్శి దేవేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మల్లి కార్జున్‌గౌడ్, జడ్పీటీసీ లావణ్యారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకిరెడ్డి కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ రాగి అశోక్, ఆర్డీవో మెంచు నగేష్, తహసీల్దార్ యాదగిరి, కౌన్సి లర్లు, నాయకులు ఆర్‌కె శ్రీనివాస్, గడ్డమీది కృష్ణాగౌడ్, గంగాధర్, సలాం,అనిల్‌కుమార్, ఐతారం నర్సింలు, రవి, గోవింద్, జీవన్‌రావు, గంగాధర్, గౌస్‌ఖురేషి తదితరులు ఉన్నారు.



విద్యార్థులను సన్మానిస్తున్న ఉపసభాపతి పద్మాదేవేందర్‌రెడ్డి

కరాటే విద్యార్థులకు ఉప సభాపతి అభినందన

మెదక్ అర్బన్: గతనెలలో కొలకత్తాలోని నేతాజీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన మూడో ఇంటర్నేషనల్ చాంపియన్ షిప్ కరాటే పోటీల్లో మెదక్‌జిల్లా విద్యార్థులు దినకర్, వందన, నిఖిల్ ప్రతిభ కనబర్చి బం గారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా సోమవారం ప్రతిభ కనబ రిచిన విద్యార్థులను ఉపసభాపతి పద్మాదేవేందర్‌రెడ్డి శాలువాలతో వారిని సన్మానించి అభినందించారు. జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో కాకుండా జాతీ యస్థాయిలో రాణించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఇంటర్నేషనల్ ఛాంపియన్‌షిప్ కరాటేపోటీల్లో 8 దేశాల నుంచి 4 వేల మంది పాల్గొనగా తెలంగాణరాష్ట్రం నుంచి 38 మంది ప్రతిభ కనబర్చగా అందులో ముగ్గురు విద్యార్థులు మెదక్ జిల్లాకు చెందిన వారేనని కరాటే నగేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, ఏఎంసీ చైర్మన్ కృష్ణా రెడ్డి, వైస్‌చైర్మన్ రాగి అశోక్, జడ్పీటీసీ లావణ్యారెడ్డి, నాయకులు తదిత రులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన వెంకటాపూర్ సర్పంచ్



బాధ్యతలను స్వీకరిస్తున్న సర్పంచ్ ఇంతియాజ్

మెదక్ రూరల్: వెంకటాపూర్‌సర్పంచ్‌గా ఇంతియాజ్‌అలీ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గ్రామ సర్పంచ్‌గా ఇటీవల జరిగిన ఉప ఎన్ని కల్లో ఇంతియాజ్ అలీ ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహించిన ఉప సర్పంచ్‌నుంచి సర్పంచ్‌గా బాధ్యతలను అందుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ బాధ్యతలు స్వీకరించిన ఇంతియాజ్‌అలీ మాట్లాడుతూ గ్రామస్థులు తనపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్య క్రమంలో టీఆర్ఎస్ నాయకుడు కిష్టయ్య, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, యాదాగౌడ్, ఉప సర్పంచ్ సత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

'వర్గీకరణ బిల్లును పార్లమెంటు సమావేశంలో పెట్టాలి'

- మెదక్‌లో రిలే దీక్ష ప్రారంభం



రిలే దీక్షలో ఎమ్మార్పీఎస్ నాయకులు

మెదక్ రూరల్: పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో ఎబీసీడీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రిలే దీక్షను చేపట్టారు. బుధవారం పట్టణంలోని రాందాస్ చౌరస్తా వద్ద రిలే నిరాహార దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎబీసీడీ వర్గీకరణ కోసం ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. దీనివల్ల మాదిగలకు అన్యాయం జరుగు తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంటులో బిల్లుపెట్టే విధంగా అన్ని పార్టీలు కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలో ఎమ్మా ర్పీఎస్ నాయకులు బాల్‌రాజు, సింహాచలం, శరత్ కుమార్, రవి, అశోక్, రమేశ్ తదితరులు మొదటిరోజు దీక్షలో కూర్చున్నారు.

తట్టు, రూబెల్లా వ్యాధి టీకాలు వేయించండి

- డాక్టర్ సవిత



సవిత

చిన్నశంకరంపేట: తట్టు, రుబెల్లా వ్యాధి నిరోధక టీకాలు కచ్చితంగా వేయిం చాలని డాక్టర్ సవిత తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ వైద్యఆరోగ్య శాఖ ఆదేశానుసారంగా 17 నుంచి మూడు వారాల పాటు టీకాలు ఇవ్వడం జరుగుతుం దన్నారు. 9 నెలల నుంచి 15 సంవత్సరాల లోపు 11,040మంది ఉన్నారన్నారు. ప్రతిరోజు 200మందికి పైగా టీకాలు ఇవ్వాలన్నదే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పనిచేయాలన్నారు.

వేతనాలందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం

- టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు ప్రవీణ్

హవేళీఘణపూర్: హవేళీఘణపూర్ మండలపరిధిలోని ఉపాధ్యా యులకు జూలై నెల వేతనాలు రాకపోవడం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ బుధ వారం పత్రికా ప్రకటన లో పేర్కొన్నారు. హవేళీఘణపూర్ మండల ఇన్‌చార్జి ఎంఈవో నరేష్‌ను సస్పెండ్ చేయగా ఆయన స్థానంలో ఎంఈవో ఇన్‌చార్జిగా బాధ్యతలు ఎవరూ తీసుకోకపోవడం వలన జూలై వేతనాలను ఎంఈవో కార్యాలయంలో బిల్లు చేయకపోవడం వల్ల ఎస్‌టీవో కార్యాలయానికి పంపలేదు. దీంతో ఉపాధ్యాయు డడలందరూ డబ్బు కోసం ఎదురుచూడాల్సి వస్తుందని పేర్కొ న్నారు. ఇకనైనా విద్యాధికారులు ఎంఈవోను నియమించి తమ ఆర్థిక ఇబ్బందులను తీర్చాలని టీపీటీఎఫ్ మండల కార్యవర్గ సభ్యులు కోరుతున్నారు.

జిల్లా యువజన సంఘాల మండల కమిటీల ఎన్నిక

మెదక్ రూరల్: యువజన సంఘాల ఆధ్వర్యంలో నూతన మండల కమిటీలను ఎన్నుకోనున్నట్లు జిల్లా అధ్యక్షుడు సాయిబాబా పేర్కొన్నారు. మండల కమిటీతో పాటు జిల్లా కమిటీ బాధ్యులను సైతం ఎన్నుకోనున్నట్లు తెలిపారు. యువకులు, స్వచ్ఛంద సేవాదృక్పథంతో రాజకీయాలకు అతీతంగా పనిచేయడానికి ముందు కొచ్చే యువకులు తమపేర్లను నమోదు చేసుకోవాలని సూచిం చారు. కమిటీల్లో పనిచేయడానికి ఆసక్తి కలిగినవారు ఈ నెల 4 లోపు వారికి సంబంధించిన వివరాలను పంపించాలని సూచిం చారు. ఇతర వివరాలకు 9959797365 సంప్రదించాలని జిల్లా బాధ్యుడు జవాజి బ్రహ్మం కోరారు.

'మొక్కలను సంరక్షించాలి'



మొక్కలను నాటి, సంరక్షిస్తామంటూ విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు పరశురాం, సతీష్‌కుమార్

హవేళీఘణపూర్: బుధవారం మండల కేంద్రమైన హవేళీఘణపూర్ ప్రాథమిక పాఠశాలలో నారీ, కలెక్టివ్ గుడ్ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. అనంతరం విద్యార్థులచే మొక్కలను సంరక్షిస్తామంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలన్నారు. ఈ కార్యక్ర మంలో స్వచ్ఛందసంస్థ సభ్యులు పర శురాం, సతీష్‌కుమార్, ఉపాధ్యాయులు పవన్, జ్యోతి, లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏబీసీడీ వర్గీకరణలో ద్వంద్వ వైఖరి

- ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి మాసాయిపేట యాదగిరి



రిలే దీక్షలో ఎమ్మార్పీఎస్ నాయకులు

చిన్నశంకరంపేట: ఏబీసీడీ వర్గీకరణలో ప్రభుత్వాలు ద్వంద వైఖరి అవలంబిస్తున్నాయని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి మాసాయిపేట యాదగిరి అన్నారు. బుధవారం మండల కార్యాల యాల ఎదుట ఎమ్మార్పీఎస్ రిలేదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు కాలయాపన చేస్తున్నాయన్నారు.

అసెంబ్లీలో తీర్మానం చేసి తెలంగాణ ముఖ్య మంత్రికేసీఆర్ అఖిలపక్షాన్ని తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. 9 వరకు రిలేదీక్షలు కొనసాగుతాయని, అప్పటికీ స్పందన రాకపోతే కలెక్టరేట్ ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ పొలిట్‌బ్యూరో సభ్యుడు మురళిమాదిగ, మండలశాఖ అధ్యక్షుడు గైనికాడి స్వామి, రాజు, ఎల్లం, దర్పల్లి నర్సయ్య, బి.రాజు తదితరులు పాల్గొన్నారు.

గురుకులాన్ని సందర్శించిన ఆర్డీవో


గురుకుల పాఠశాలలో సమస్యలను తెలుసుకుంటున్న నర్సాపూర్ ఆర్డీవో వెంకటేశ్వర్‌రావు

కొల్చారం: గురుకుల పాఠశాలలో కొన్ని రోజుల నుంచి తాగునీటి సమస్య తీవ్రంగా ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ట్యాంకర్లతో నీటిని సరఫరా చేసినప్పటికీ అందరికీ అందడం లేదని గురుకుల పాఠశాల సిబ్బంది ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో నర్సాపూర్ ఆర్డీవో వెంకటేశ్వర్‌రావు పాఠశాలను సందర్శించారు. పాఠశాలలోని తాగునీటి సమస్యపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపుతానని, త్వరలో సమస్య పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతానని పేర్కొన్నారు. అనంతరం రెవెన్యూ కార్యాలయం ఎదుట మొక్కలను నాటారు. హరితహారంలో నాటిన ప్రతిమొక్కను సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమేశ్, ఎంపీడీవో వామన్‌రావు, ఆర్ఐ రాముతో పాటు వీఆర్‌వోలు పాల్గొన్నారు.

7న నర్సాపూర్‌కు మంత్రి హరీశ్‌రావు రాక

నర్సాపూర్: రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఈ నెల 7వ తేదీన నర్సాపూర్‌కు రానున్నట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది. ఈ సందర్భంగా పట్టణంలో కొత్తగా మంజూరయిన 500 డబుల్‌బెడ్రూం ఇళ్ల పనులను మంత్రి ప్రారంభిస్తారని తెలుస్తోంది. దీంతో పాటు నర్సాపూర్ నియోజకవర్గ సమీక్ష సమావేశం కూడా మంత్రి నిర్వహించే అవకాశముంది.

హరితహారంపై సమీక్ష సమావేశం


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ హరికృష్ణ

శివ్వంపేట: హరితహారం కార్యక్రమాన్ని ప్రతిగ్రామంలో విజయవంతం చేయాలని ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, ఎంపీడీవో కౌసల్యాదేవి అన్నారు. బుధవారం శివ్వంపేట ఎంపీడీవో కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ సీసీలు, వీవోఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో మొక్కలను నాటే బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ పాండురంగం, ఐకేపీ ఏపీవో అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

'దసరా సెలవుల్లో ఉపాధ్యాయులకు బదిలీలు, ప్రమోషన్లు ఇవ్వాలి'


విలేకరులతో మాట్లాడుతున్న టీపీటీఎఫ్ నాయకులు

నర్సాపూర్‌రూరల్: దసరా సెలవుల్లోనే ఉపాధ్యాయులకు బదిలీలు, ప్రమోషన్లు ఇవ్వాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ముత్యాలు, ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్ డిమాండ్ చేశారు. బుధవారం వారు నర్సాపూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ జోనల్ విధానం కొనసాగించాలని, మధ్యాహ్న భోజన బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. పీఈటీ, పండిత్ ఉపాధ్యాయులను అప్‌గ్రేడ్ చేసిన జీవోపై స్పష్టత ఇవ్వాలని, పదోన్నతులు కల్పించాలన్నారు. స్పెషల్ ఉపాధ్యాయులకు ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎర్రగొల్ల శ్రీనివాస్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎన్నిక

శివ్వంపేట: సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శిగా చండి గ్రామానికి చెందిన ఎ.మహేందర్‌రెడ్డి ఎన్నికయ్యారు. బుధవారం ఆయన శివ్వంపేటలో విలేకరులతో మాట్లాడుతూ జూలై 30న మెదక్‌లో నిర్వహించిన సీఐటీయూ 12వ మహాసభలో తనపై నమ్మకంతో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శిగా ఎన్నుకోవడం జరిగిందని, మెదక్ జిల్లా కార్మిక వర్గానికి, నూతన జిల్లా కమిటీకి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. రాబోయే కాలంలో సీఐటీయూను విస్తరించడానికి, కార్మిక సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు.

విద్యార్థులకు చేయూతనివ్వాలి

జిన్నారం: విద్యారంగానికి చేయూతనిచ్చేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కాటా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని వావిలాల, కొర్లకుంట, సోలక్‌పల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో 3వేల మంది విద్యార్థులకు శ్రీనివాస్‌గౌడ్ నోటుబుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు సహకారం అందించాలన్నారు.

'మీసేవ'ను సద్వినియోగం చేసుకోవాలి

• తహసీల్దార్ రమేశ్

కొల్చారం: ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ సేవలు ఉంటాయని తహసీల్దార్ రమేశ్, ఎంపీడీవో వామన్‌రావు తెలిపారు. బుధవారం మండలంలోని సంగాయిపేట, చిన్నఘణపూర్ గ్రామాల్లో మీసేవా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాంకు సేవలు, ఆసరా ఫించన్ల పంపిణీ, ఉపాధి హామీ, పంచాయతీ సేవలు తదితర సేవలను మీసేవ ద్వారా అందజేయనున్నట్లు వారు పేర్కొన్నారు. మీసేవను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


చిన్నఘణపూర్‌లో మీసేవ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ రమేశ్, ఎంపీడీవో వామన్‌రావు

సోమక్కపేట్‌లో తల్లిపాల వారోత్సవాలు

చిలప్‌చెడ్: మండలంలోని సోమక్కపేట గ్రామంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో బాలింతలకు తగిన సూచనలు ఇవ్వడం జరిగిందని అంగన్‌వాడీ టీచర్ సిద్దమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలింతలు తమ శిశువులకు ముర్రుపాలు ఇవ్వాలని, ముర్రుపాలు ఇవ్వడం వల్ల శిశువులకు రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రంలో ప్రతి నెలా ఏర్పాటు చేస్తున్న చికిత్స శిబిరంలో చూపించుకోవాలని, ప్రసవం కొరకు ప్రభుత్వ ఆసుపత్రులకే వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మణ్, అంగన్‌వాడీ టీచర్లు ఎన్.బూలీ, ఆర్.శోభ, కె.ప్రసన్న, ఏఎన్‌ఎం అనిత, ఆశ వర్కర్ సుజాత తదితరులున్నారు.


సోమక్కపేటలో బాలింతలకు, గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

'శిథిలావస్థ భవనాలను తొలగించాలి'

నర్సాపూర్: పట్టణంలోని పాత మార్కెట్ ప్రాంతంలోని పురాతన భవనాలు శిథిలావస్థలో కూలడానికి సిద్ధంగా ఉన్నాయని పంచాయతీ అధికారులు దృష్టి పెట్టి తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. పట్టణంలోని పాత మార్కెట్ ప్రాంతంలో కొన్ని భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో అందులో ఎవరూ ఉండటం లేదు. వాటితో పక్కన ఉన్న భవనాల వారికి ప్రమాదం పొంచి ఉందని స్థానికులు వాపోతున్నారు. ఎన్నోసార్లు అధికారులకు, నాయకులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన భవనాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

దళిత నిరుద్యోగ యువతకు సబ్సిడీ రుణాలు

రామచంద్రాపురం: దళిత నిరుద్యోగ యువతకు 2017-2018 సంవత్సరానికి గాను ప్రభుత్వం సబ్సిడీ రుణాలు అందిస్తుందని రామచంద్రాపురం ఎంపీడీవో సుధీర్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 49 యూనిట్లకు గాను రూ.82 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఇందులో మూడు కేటగిరిలున్నాయన్నారు. మొదటి కేటగిరిలో 80శాతం, రెండో కేటగిరిలో 70 శాతం, మూడో కేటగిరిలో 60 శాతం సబ్సిడీ ఉందన్నారు. 15లోగా ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

జిన్నారం: ఉమ్మడి జిన్నారం మండలంలో ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో సుధీర్ తెలిపారు. ఆయన బుధవారం జిన్నారంలో మాట్లాడుతూ ఉమ్మడి మండలంలోని ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇందుకోసం ఆదాయ, కుల ధ్రువీకరణ, దరఖాస్తు పత్రాలను ఎంపీడీవో కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

మీజిల్స్, రుబెల్లాపై అవగాహన

జిన్నారం: ప్రాణాంతక వ్యాధులైన మీజిల్స్, రుబెల్లాపై బొల్లారం మోడల్ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో బొల్లారం పీహెచ్‌సీ డాక్టర్ శ్రీవాణి, ఎంపీహెచ్‌వో చంద్రశేఖర్, పాఠశాల ప్రిన్సిపాల్ శైలజ పాల్గొన్నారు. 17 తేదీ నుంచి విద్యార్థులకు వ్యాధి నివారణ టీకాలు వేస్తామని వారు తెలిపారు.

'2013 భూచట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలి'

రామచంద్రాపురం: కొల్లూరు రైతుల నుంచి ప్రభుత్వం సేకరిస్తున్న భూమికి నష్ట పరిహారాన్ని 2013 భూచట్టం ప్రకారం చెల్లించాలని సీఐటీయూ మండల కార్యదర్శి వెంకటరాజ్యం డిమాండ్ చేశారు. ఈ విషయమై వెంకటరాజ్యం బుధవారం డిప్యూటీ తహసీల్దార్ గంగాధర్‌కు వినతిపత్రం సమర్పించారు.

జోగిపేటలో యాంటీ ర్యాగింగ్‌పై సెమినార్

జోగిపేట: పట్టణంలోని సీఆర్ఎన్ స్మారక మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ర్యాగింగ్ వ్యతిరేక సదస్సును నిర్వహించారు. ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నరేశ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో ఏఎస్ఐ కిష్టయ్య మాట్లాడుతూ ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నరేశ్ మాట్లాడుతూ తోటి విద్యార్థులను ర్యాగింగ్ పేరిట ఇబ్బందులకు గురిచేయడం శారీరకంగా, మానసికంగా హింసించడం నేరమన్నారు. కార్యక్రమంలో సీపీఐ డివిజన్ కార్యదర్శి నర్సింహులు, నాయకులు బుచ్చయ్య, సందీప్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

● ఎమ్మెల్యే రామలింగారెడ్డి

చేగుంట: ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని శాసనసభ అంచనాల కమిటీ చైర్మన్, దుబ్బాక ఎమ్మెల్యే రామలింగారెడ్డి పిలుపునిచ్చారు. చేగుంటలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. పేదింటి ఆడపిల్లల వివాహానికి సీఎం కేసీఆర్ రూ.51వేల చొప్పున కల్యాణలక్ష్మి పథకంలో అందజేస్తున్నారని, ఏప్రిల్ తర్వాత రూ.75వేల చొప్పున వధువు తల్లి పేరున చెక్కును అందజేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అనేక పథకాలు ఏర్పాటు చేసిందని, వాటన్నింటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గొర్రెలు, కల్యాణలక్ష్మి పథకాల్లో దళారుల మాటలు నమ్మవద్దని, అర్హులైన వారికి ప్రభుత్వమే అండగా ఉంటుందన్నారు. మండలంలోని 22 మందికి రూ.51 వేల చొప్పున, ఒకరికి రూ.75 వేల చొప్పున మంజూరైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట జడ్పీటీసీ శోభారాణి, ఏఎంసీ చైర్మన్ సుజాత, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో అనిల్‌కుమార్, ఈవోపీఆర్డీ ఉమాదేవి, టీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెంగల్‌రావు, ఇబ్రహీంపూర్ సొసైటీ చైర్మన్ నారాయణరెడ్డి, సర్పంచ్‌లు జగన్‌గౌడ్, నాగభూషణం, హోళియా, రామచంద్రం, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.



చేగుంటలో డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామలింగారెడ్డి, కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే

'డబుల్' నిర్మాణాలకు స్థల సేకరణ

డబుల్‌బెడ్రూంల ఇళ్ల నిర్మాణానికి అన్ని గ్రామాల్లో స్థలాలను పరిశీలిస్తున్నట్లు ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన చేగుంటలోని సర్వే నెంబర్ 330లో నిర్మిస్తున్న డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణాలను స్థానిక నాయకులతో కలిసి బుధవారం పరిశీలించారు. పనులు వేగంగా జరగడంపై కాంట్రాక్టర్‌ను అభినందించారు. డబల్‌బెడ్రూంల నిర్మాణంలో నాణ్యత పాటించాలని, చిరకాలం మన్నేవిధంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా మండలంలోని అన్ని గ్రామాల్లో డబుల్‌బెడ్రూం నిర్మాణాలకు స్థల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. స్థానిక తహసీల్దార్ గ్రామాల్లోని ప్రభుత్వ భూములను పరిశీలించనున్నట్లు తెలిపారు. అనంతరం చిట్టోజిపల్లి గ్రామానికి మంజూరైన విద్యుత్ సబ్‌స్టేషన్ కోసం స్థల పరిశీలన నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వెంట ట్రాన్స్‌కో ఏడీ సంతోష్, తహసీల్దార్ విజయలక్ష్మి, జడ్పీటీసీ శోభారాణి, ఏఎంసీ చైర్మన్ సుజాత, టీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెంగల్‌రావు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వస్తువులనే విక్రయించాలి

వినియోగదారులకు నాణ్యమైన వస్తువులను విక్రయించినప్పుడే దుకాణంపై మంచి అభిప్రాయం ఏర్పడుతుందని ఎమ్మెల్యే రామలింగారెడ్డి పేర్కొన్నారు. మండలకేంద్రమైన చేగుంటలో నూతనంగా ఏర్పడిన మహాలక్ష్మి హార్డ్‌వేర్ షాపును బుధవారం స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పురోహితుడు శివనూరి రాధాకృష్ణశర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించగా దుకాణంలో తొలి అమ్మకాన్ని ఇబ్రహీంపూర్ సొసైటీ చైర్మన్ నారాయణరెడ్డికి ఎమ్మెల్యే అందజేశారు.

పాఠశాల బియ్యాన్ని పరిశీలించిన తహసీల్దార్

మనోహరాబాద్(తూప్రాన్): మనోహరాబాద్‌లోని ఉన్నత పాఠశాలను తహసీల్దార్ నజీబ్ అహ్మద్ బుధవారం సందర్శించి మధ్యాహ్న భోజన వంటకాలకు వాడుతున్న బియ్యాన్ని పరిశీలించారు. బియ్యంలో పురుగులు, రాళ్లు వస్తున్నాయని అందిన ఫిర్యాదు మేరకు ఆయన పాఠశాలకు వెళ్లి బియ్యం బస్తాల నిల్వలను, బియ్యం నాణ్యతను పరిశీలించారు. బియ్యంలో పురుగులున్నట్లు గమనించి పౌరసరఫరాల శాఖ డీఎంతో ఫోన్‌లో మాట్లాడి బియ్యాన్ని మార్చాలని, పాఠశాలకు వేరే బియ్యం సరఫరా చేయాలని వివరించారు. ఈ బియ్యాన్ని వాడొద్దని వంటల నిర్వాహకులకు ఆయన సూచించారు. తహసీల్దారు వెంట డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాస్ కూడా ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు

చేగుంట: తల్లిపాల వారోత్సవాలను మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం నిర్వహించారు. మండలంలోని ఇబ్రహీంపూర్, నార్సింగి మండలంలోని వళ్లూరు గ్రామాల్లో అంగన్‌వాడి కేంద్రాల్లో తల్లులు, గర్భిణులతో సమావేశం నిర్వహించారు. బిడ్డపుట్టిన గంటలోపు ముర్రుపాలు పట్టాలని, ముర్రుపాలలో వ్యాధినిరోధక లక్షణాలున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగభూషణం, అంగన్‌వాడి కార్యకర్తలు మంజుల, జయ, పాఠశాల ఉపాధ్యాయులు, తల్లులు పాల్గొన్నారు.

ముప్పిరెడ్డిపల్లిలో

మనోహరాబాద్ (తూప్రాన్): మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సర్పంచ్ బస్వన్నగారి సంజీవ తల్లీపాల విశిష్టతను గర్భిణులు, బాలింతలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, అంగన్‌వాడీ టీచర్ అనిత పాల్గొన్నారు.

కరాటేలో తూప్రాన్ విద్యార్థుల ప్రతిభ

తూప్రాన్‌రూరల్: హైదరాబాద్‌లోని దమ్మాయిగూడలో బుధవారం నిర్వహించిన కరాటే బెల్టు టెస్టులో తూప్రాన్ మండలానికి చెందిన ఐదుగురు విద్యార్థులు మంచి ప్రతిభ కనబరచి ఎల్లో బెల్టులను దక్కించుకున్నట్లు కరాటే మాస్టర్ భిక్షపతి తెలిపారు. అమూల్య, హారతి, లావన్య, అజయ్‌ఆదిత్య, అఖిల్‌కు ఈ కారెటే టెస్టు నిర్వాహకుడు కియో షోటోకాన్, కరాటే అసోసియేషన్ చీఫ్ మహ్మద్ జహంగీర్ బెల్టును అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు మనోహరాబాద్ నర్సరీలో హరితహారం

తూప్రాన్‌రూరల్: మనోహరాబాద్ శివారులోని నర్సరీ ప్రాంతంలో అటవీశాఖ ఆధ్వర్యంలో గురువారం హరితహారం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ బండ నరేందర్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ చందనా మిశ్రా తదితరులు హాజరుకానున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు.

హాస్టల్ విద్యార్థులకు దుప్పట్ల పంపిణి

వెల్దుర్తి: ప్రభుత్వం మంజూరు చసిన పలు వస్తువులను బుధవారం మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌లో వార్డెన్ శ్రీనివాస్ విద్యార్థులకు పంపిణీ చేశారు. ప్రభుత్వం ద్వారా మంజూరైన యూనిఫాంలు, నోట్ పుస్తకాలు, దుప్పట్లు, పాదరక్షలు, బ్యాగులను పంపిణీ చేశామని తెలిపారు. విద్యార్థులు పాఠశాల నుంచి రాగానే శ్రద్ధగా చదువుకునేలా ప్రత్యేక సూచనలు చేస్తున్నట్లు వార్డెన్ తెలిపారు.

5 నుంచి టెన్త్ విద్యార్థులకు శిక్షణ

తూప్రాన్‌రూరల్: పదోతరగతి పరీక్షల్లో సత్ఫలితాలను సాధించేందుకు విద్యార్థులకు నాణ్యమైన విద్యపై శిక్షణను ఇచ్చే కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా మెదక్‌లో ఈనెల 5నుంచి 7వతేదీ వరకు తూప్రాన్ డివిజన్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థులకు వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండోవిడత శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. పాఠశాలల వారీగా పదోతరగతిలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా కొందరిని ఎంపిక చేసి శిక్షణకు పంపిస్తామన్నారు. 40లోపు సంఖ్య ఉంటే నలుగురిని, వందలోపు సంఖ్య ఉంటే ఆరుగురిని, అంతకన్నా ఎక్కువ సంఖ్య ఉంటే ఎనిమిది మంది విద్యార్థుల చొప్పున ఎంపిక చేసి శిక్షణకు పంపించాలని తూప్రాన్ ఎంఈవో నర్సింలు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ప్రతి విద్యార్థికి మూడు రోజులకు సరిపడా మధ్యాహ్న భోజన బియ్యాన్ని వెంట పంపించాలని ఆయన తెలిపారు. లిటిల్ టీచర్, లిటిల్ లీడర్ అనే కాన్సెప్టుతో శిక్షణ కొనసాగుతుందని, ఈ శిక్షణ పొందిన విద్యార్థులు పాఠశాలలో క్వాలిటీ ఎడ్యుకేషన్‌పై బోధించాల్సి ఉంటుందని నర్సింలు తెలిపారు.

శివాలయ నిర్మాణానికి పూజలు

చేగుంట: మండల కేంద్రమైన చేగుంటలోని వాసవికన్యకా పరమేశ్వరి ఆలయంలో శివాలయ నిర్మాణ పూజలు బుధవారం నిర్వహించారు. సరస్వతీక్షేత్ర నిర్మాత అష్టావధాని అష్టకాల నర్సింహరామశర్మ ఆధ్వర్యంలో వాస్తు పూజలు నిర్వహించగా స్థానిక పురోహితుడు శివనూరి రామనాథశర్మ ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు.

'గెస్ట్‌హౌజ్'లో ఫారెస్టు రేంజ్ కార్యాలయం?

తూప్రాన్: పట్టణంలోని ఆటవీశాఖ అతిథి గృహంలో ఫారెస్టు రేంజ్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు ఆటవీశాఖ అధికారులు ప్రయత్నాలు చేపట్టి, మరమ్మతులు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాల పునర్విభజనలో మెదక్ జిల్లాలో రెవెన్యూ డివిజన్‌గా తూప్రాన్‌ను ఏర్పాటు చేశారు. డివిజన్ కేంద్రానికి కొత్తగా మంజూరైన రేంజ్ కార్యాలయాన్ని గతయేడాది ఫిబ్రవరి వరకు నిర్వహించారు. అద్దె అలవెన్స్‌లు మంజూరు కాకపోవడంతో తూప్రాన్‌లోని కార్యాలయం ఎత్తివేశారు. ప్రస్తుతం రామాయంపేట నుంచి పాలన కొనసాగిస్తున్నారు. తూప్రాన్‌లో రేంజ్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని అధికారుల నుంచి వత్తిడి రావడంతో మనోహరాబాద్‌లోని ఫారెస్టు అతిథి గృహంలో రేంజ్ కార్యాలయం ఏర్పాటు చేసేందుకు నిశ్చయించారు. మనోహరాబాద్‌లోని ఫారెస్ట్ స్థలంలో 1991 ఆగస్టు 12న అప్పటి అటవీశాఖ మంత్రి చంద్రశేఖర్ ప్రారంభించారు. అయితే, కొన్నేళ్లకే ఆ అతిథి గృహాన్ని నక్సలైట్లు పేల్చివేశారు. అప్పటి నుంచి ఆ అతిథి గృహం వృథగా ఉంది. ప్రస్తుతం ఆ భవనానికి మరమ్మతులు చేసి తూప్రాన్ ఫారెస్టు రేంజ్ కార్యాలయంగా వాడుకోడానికి నిశ్చయించారు. కొద్దిరోజుల్లోనే మరమ్మతులు పూర్తి చేసి రేంజ్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నారు.




మనోహరాబాద్‌లోని ఫారెస్టు గెస్టు హౌజ్

హరితదళం పేర్ల నమోదులో ఇబ్బందులు

● ఒకే పేరు 65సార్లు నమోదు

వెల్దుర్తి: హరితహారం విజయవంతానికి ప్రభుత్వం చేపట్టిన పేర్ల నమోదు కార్యక్రమానికి సాఫ్ట్‌వేర్‌లో ఏర్పడిన ఇబ్బందులతో కంప్యూటర్ ఆపరేటర్లు, ప్రభుత్వ అధికారులు ఇబ్బంది పడుతున్నారు. పీఎఫ్ఎంఐఎస్ హరితదలం సభ్యుల పేర్లు నమోదు చేయడానికి ఏర్పాటు చేసిన సాఫ్ట్‌వేర్‌లో సాంకేతిక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కంప్యూటీకరణలో ఒకే పేరు 65 సార్లు నమోదయింది. ఇలాగైతే పేర్లు నమోదు చేయడం కష్టమని అధికారులు తెలిపారు. ప్రభుత్వం సాఫ్ట్‌వేర్‌ను పూర్తి స్థాయిలో సిద్ధం చేస్తేనే కార్యక్రమం వేగంగా ముందుకెళ్తుందని అధికారులు తెలిపారు.



ఒకే పేరు 65 సార్లు నమోదైన దృశ్యం

ఏఎన్ఎంకు ఉత్తమ సేవ అవార్డు



ఏఎన్ఎంకు అవార్డు అందజేస్తున్న కలెక్టర్ భారతి

వెల్దుర్తి: మండలంలోని కొప్పులపల్లి గ్రామంలో ఎన్‌పీహెచ్‌గా వైద్య సేవలు అందిస్తున్న సరళకు జిల్లా కలెక్టర్ భారతి హోళికేరి ఉత్తమ సేవా అవార్డును అందజేశారు. వెల్దుర్తి మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పనిచేస్తున్న సరళ కొప్పులపల్లి ఏఎన్ఎంగా అంకితభావంతో పనిచేయడమే కాకుండా రోగులకు సకాలంలో వైద్యసేవలు, పిల్లలకు మెరుగైన వైద్యం అందించినందుకు గానూ ఆమెకు ఉత్తమ సేవా అవార్డును అందజేశారు. సరళకు ఉత్తమ అవార్డు రావడం పట్ల వెల్దుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

దళిత సంఘర్షణ సమితి జిల్లా కార్యదర్శిగా రమేష్

చేగుంట: హైదరాబాద్‌లోని దళిత సంఘర్షణ సమితి కార్యాలయంలో మండలంలోని బీకొండాపూర్ గ్రామానికి చెందిన రమేష్‌ను దళిత సంఘర్షణ సమితి మెదక్ జిల్లా కార్యదర్శిగా నియమిస్తూ అంబేద్కర్‌సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాధాకృష్ణ నియామక పత్రం అందజేశారు. గ్రామాల్లోని దళితుల్లో చైతన్యం తీసుకువచ్చి, అందరిని అక్షరాస్యులుగా చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘర్షణ సమితి రాష్ట్ర కోశాధికారి సుదర్శన్, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వరాలతల్లి.. వరలక్ష్మి

- ధన, ధాన్య, సంతానం, ఐశ్వర్యం వంటి సంపదలిచ్చే అమ్మవారు
- శ్రావణమాసంలోని పౌర్ణమి ముందు వచ్చే శుక్రవారం రోజు ప్రత్యేక పూజ
- 4న వరలక్ష్మీ వ్రతం
- పంచామృతాలతో అమ్మవారికి అభిషేకం
- ఆచారాన్ని బట్టి బంగారు బిళ్లపై లక్ష్మీదేవి ఆకారం ముద్రణ



కొమురవెల్లి రూరల్ : వరదాయిని వరలక్ష్మి. అష్టలక్ష్ములు అనుగ్రహించే ధన, ధాన్య, సంతానం, ఐశ్వర్యాల వంటి అనేక సంపదలు వరలక్ష్మిని ఆరాధించడం వల్ల పొందవచ్చునని భక్తుల విశ్వాసం. విష్ణుమూర్తి అర్ధాంగి అయిన మహాలక్ష్మిని ఆరాధించడం వల్ల కోరిన కోరికలన్నీ తీరుతాయని ప్రజల నమ్మకం. శ్రావణమాసంలోని పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం రోజు ఈ వ్రతాన్ని ఆచరిస్తారు. వ్రతం సందర్భంగా వరలక్ష్మీ అమ్మవారి ప్రతిమను సిద్ధం చేసుకుంటారు. అలంకరించిన స్థలంలో పైన కలశస్థాపన చేసి, గణపతి పూజ పూర్తి చేసి పంచామృతాలతో అమ్మవారి ప్రతిమను అభిషేకిస్తారు. అన్ని ఉపచారాలతో పూజ పూర్తి చేసి రమ్యమైన హారతులతో ప్రార్ధన చేస్తారు. కొన్ని ప్రాంతాల్లో వంశపారంపర్య సాంప్రదాయాన్ని అనుసరించి బంగారు బిళ్ల (కాసు) పై లక్ష్మీదేవి ఆకారాన్ని ముద్ర వేయించి పూజిస్తారు. సంవత్సరానికి ఒకటిచొప్పున ఏర్పడిన ఈ కాసులను పేర్చి మెడలో ధరిస్తారు. వడికిన దారముతో దోరము తయారు చేసి అమ్మవారి ముందుంచి అర్చిస్తారు. షడ్రుచులతో తయారుచేసిన పక్వ పదార్థాలను నివేదన చేస్తారు. ముత్తైదువులను, ఇరుగుపొరుగు వారిని ఆహ్వానించి ఫలపుష్పాలను, పసుపుకుంకుమలతో కూడిన వాయనాన్ని దానం చేస్తారు. నూతన వస్త్రాలను ఇచ్చి నమస్కరిస్తారు.



వరలక్ష్మీదేవి శ్లోకం

పాలకడలిన శయనించు ప్రభువు చెంత
మేలిముసుగున ముంగురుల్ సుడులు తిరుగ
వాసమున్నట్టి శ్రీ వాసుదేవు పత్ని
వేడుకుందును వరలక్ష్మీ వేగరమ్మ.
కళలు గురిసెడి ముఖమున కాంతులీన
చిన్ని నుదుటను సింధూర తిలకమొప్ప
కనుల మెరుపులు జగతి వెన్నెలను పరువ
వేడుకొందును వరలక్ష్మీ వేగరమ్మ.
మందహాసము మదిని చందనము గురియ
కంకణమ్ముల ఖణ ఖణ ధ్వనులు జేయ
ఘల్లు ఘల్లున గజ్జెలందియలు మ్రోయ
వేడుకొందును వరలక్ష్మీ వేగరమ్మ.





-పార్నంది రాధాశర్మ, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు



ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ హోల్డర్ ధ్రువీకరణ పత్రం, జ్ఞాపికతో ఎన్నవెల్లి రాజమౌళి (ఫైల్)



సిద్దిపేటలోని తులిప్స్ కాన్సెప్ట్ స్కూల్లో రాజమౌళిని సన్మానిస్తున్న విద్యార్థినులు (ఫైల్)

చిన్నారుల చెంతకు

కథల తాతయ్య

కథ.. ఒక్కొక్కరు ఒక రకంగా చెబుతారు. అందులో ఎన్నవెల్లి రాజమౌళిది ప్రత్యేక విధానం. విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో చెప్పడం ఆయన ప్రత్యేకత. పాఠశాలల్లో రాజమౌళి ప్రదర్శన గంట వరకు ఉంటుంది. కథలు చెప్పేటపుడు పిల్లలను ఆ కథలో భాగస్వాములుగా చేస్తాడు. నవ్వుతాడు.. నవ్విస్తాడు. తన మాటలతో ఆనందపరుస్తాడు. అందుకే ఆయన కథంటే చిన్నారులకు ప్రాణం. ఉపాధ్యాయుడిగా ఉద్యోగ విరమణ చేశాక సొంత ఖర్చులతో బాల వికాస యాత్ర పేరిట తెలంగాణ అంతటా పర్యటిస్తున్నారు. ఈయన బాల సాహిత్యంలో పలు కథలు, గేయాలు రచించి పుస్తకాలు ప్రచురించారు.



తెలంగాణ రాష్ట్ర స్థాయి ఉత్తమ సాహితీవేత్తగా శాతవాహన విశ్వ విద్యాలయం ఉపకులపతి కడారు వీరారెడ్డిచే జ్ఞాపిక తీసుకుంటున్న రాజమౌళి (ఫైల్)



తొగుట మండలం బంజేరుపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో కథ చెబుతున్న ఎన్నవెల్లి రాజమౌళి(ఫైల్)

- తెలంగాణ అంతటా బాల వికాస యాత్రకు సిద్ధమైన ఎన్నవెల్లి రాజమౌళి
- జూన్‌లో రెండో విడత యాత్ర ప్రారంభం
- ఉత్తమ ఉపాధ్యాయునిగా, బాల సాహిత్యంలో కవిగా గుర్తింపు
- విద్యార్థుల ఆనందమే పరమావధిగా జీవిస్తున్న రచయిత
- ఆయన కథ వినడమంటే చిన్నారులకు చాలా ఇష్టం

సిద్దిపేట : సిద్దిపేట మండలం తడ్కపల్లికి చెందిన ఎన్నవెల్లి రాజమౌళి తాతయ్య నాగేంద్రయ్య (నానమ్మ అన్న) సంస్థానాల్లో హరికథలు చెప్పి సన్మానం పొందారట. ఆయన ప్రభావం రాజమౌళిలో బాల్యం నుంచే పడింది. హైస్కూల్ చదివే రోజుల్లో సినిమా అయినా భాగవతమైనా, హరికథైనా చూస్తే తర్వాత తోటి మిత్రుల ఎదుట అభినయంతో ప్రదర్శించేవారు. పెద్ద వాడయ్యాక నిరుద్యోగిగా ఎన్ని బాధలు వచ్చినా, సంతోషమొచ్చినా సినిమా పాటలు పాడుకుని ఊరట పొందేవారు. ఈ అనుకరణ, కథలు చెప్పే విధానం, పాటలు పాడే విధానం ఉపాధ్యాయ వృత్తిలో బాగా ఉపయోగపడిందని రాజమౌళి అంటారు.

ఉపాధ్యాయుడిగా

ఎన్నవెల్లి రాజమౌళి 1982 లో నారాయణఖేడ్ మండలం తుర్కపల్లిలో టీచర్‌గా ఉద్యోగంగా చేరారు. 2011 డిసెంబర్‌లో తొగుట మండలం ఘనపురం ప్రాథమిక పాఠశాలలో పదవీ విరమణ పొందారు. 2005లో ఆంధ్రజ్యోతి- ఎమెస్కో సంయుక్తంగా నిర్వహించిన బడి నేర్పిన పాఠాలు వ్యాస సంకలనంలో ఈయన రచనకు చోటు దక్కింది. ఈ సంకలనం కోసం 1100మంది వ్యాసాలు పంపగా రాజమౌళి రచించిన ఒడి నుంచి బడికి- బడి నుంచి గుడికి వ్యాసం ప్రచురితమైంది. ఈ రచనకు పారితోషికం లభించడమే కాక రాష్ట్ర బహుమతి పొందినట్లు ధ్రువపత్రంతో పాటు స్వర్ణపతకంతో సత్కారం పొందారు. 2007లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. 1997లో స్వాతంత్ర్య స్వర్ణోత్సవాల సందర్భంగా నాగరికుల జవాబుదారీ అంశంపై పది నినాదాలు రాసిన ఆయనకు రాష్ట్ర స్థాయి బహుమతి లభించింది. 2005లో విద్యార్థులలో విలువలు పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర అంశంపై రాసిన వ్యాసానికి లయన్స్ క్లబ్‌వారు బంగారు పతకంతో సత్కరించారు. 1999 సంవత్సరంలో తడ్కపల్లిలో సంచార జాతికి చెందిన ఇద్దరు కొట్టుకోవడంతో ఒకరు మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు వచ్చి కేసు చేసేంతవరకు గాయపడిన వ్యక్తి అలాగే ఉండాలని వీఏవో అభ్యంతరం చెప్పినా పట్టించుకోకుండా అతన్ని సిద్దిపేట ఆస్పత్రిలో చేర్పించినందుకు రెడ్ అండ్ వైట్ ఢిల్లీ వారు బ్రేవరీ అవార్డు అందజేశారు.

ఉద్యోగ విరమణ అనంతరం

ఉపాధ్యాయునిగా ఉద్యోగ విరమణ అనంతరం తన శిష్యుని వివాహానికి భార్య మల్లేశ్వరితో బస్సులో జోగిపేట వెళ్తుండగా పాఠశాలలకు వెళ్లి కథలు, పద్యాలు వినిపించాలనే ఆలోచన వచ్చిందని రాజమౌళికి వచ్చింది. ఆ విషయం తన మిత్రుడు వర్కోలు లక్ష్మయ్యకు చెప్పగానే బాగుంటుందని ప్రోత్సహించారు. ఎప్పుడు, ఎలా ప్రారంభించాలని ఆలోచిస్తుండగా 2012 జూన్‌లో అప్పటి తొగుట ఎంఈవో రాజేశ్వర్‌రెడ్డి రాజమౌళికి ఫోన్ చేశారు. అప్పటికే కథల రాజుగా దినపత్రికలో వచ్చిన వార్తకు స్పందించిన ఆయన ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి కథలు చెప్తానంటే సర్క్యులర్ ఇస్తానని చెప్పారు. ఆయన ప్రోత్సాహంతో తొగుట మండలంలోని పల్లెపహాడ్‌లోని ప్రాథమికోన్నత పాఠశాలలో బాలవికాస యాత్రకు శ్రీకారం చుట్టారు. ఈ యాత్ర పేరిట తెలంగాణలోని 263 పాఠశాలల్లో స్వచ్ఛందంగా కార్యక్రమాలు నిర్వహించారు. అలా చేసినందుకు 2015లో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో రాజమౌళికి చోటు లభించింది. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం 2015లో సిద్దిపేట మండల స్థాయిలో ఉత్తమ సాహితీ వేత్తగా రూ.10,116లతో ప్రభుత్వ సత్కారాన్ని ఆయన పొందారు. అదే సంవత్సరం కరీంనగర్‌లోని శాతవాహన విశ్వవిద్యాలయం వారిచే రాష్ట్ర స్థాయి ఉత్తమ సాహితీ వేత్తగా అవార్డు అందుకున్నారు. ఇలా పలుమార్లు తన ప్రత్యేకతను చాటుకుంటూ రాజమౌళి ఎన్నో అవార్డులు అందుకున్నారు.

రాగయుక్తంగా, భావయుక్తంగా

పాఠశాలల్లో రాజమౌళి ప్రదర్శన గంట వరకు ఉంటుంది. పద్యాలు రాగయుక్తంగా, భావయుక్తంగా పాడి పిల్లలతో పాడించడం ఆయన ప్రత్యేకత. కథలు చెప్పేటపుడు పిల్లలను ఆకథలో భాగస్వాములుగా చేస్తాడు. నవ్వుతాడు, నవ్విస్తాడు. మొత్తంపై హాస్యంతో అలరిస్తాడు. బాలవికాస యాత్రలో ఆయన ఎన్నో సన్మానాలు పొందారు. మొదట్లో ఎంఈవోలు సర్క్యులర్లు ఇచ్చినా తర్వాత కాలంలో వివిధ పత్రికల్లో వచ్చిన వార్తలే ఆయనకు మార్గదర్శనం చేశాయి. వార్తల కటింగ్‌లు లామినేషన్ చేసుకొని ప్రధానోపాధ్యాయులకు చూపించగానే ప్రదర్శన ఇవ్వడానికి ముందుకొచ్చేవారు. పూర్వ మహబూబ్‌నగర్ జిల్లాలోని షాద్‌నగర్‌లో బంధువుల పెళ్లికి వెళ్లినపుడు అక్కడున్న ఒక పాఠశాలకు వెళ్లి ప్రదర్శన ఇవ్వడం చూస్తే ఆయనకు కథలు చెప్పడంలో ఉన్న ఆసక్తి ఏమిటో మనకు తెలుస్తుంది. ఇలా బంధువులు, చివరకు కన్న కూతురు ఇంటికి వెళ్లినపుడు, భద్రాచలంలాంటి క్షేత్రాలకు వెళ్లినప్పుడు కూడా ఆయన సమీపంలోని పాఠశాలలను బాల వికాస యాత్ర కు వేదికలుగా మలుచుకున్నారు. పాఠశాలలకు వెళ్లినపుడు ప్రధానోపాధ్యాయుల స్పందనలు రాయిస్తే నాలుగు డైరీలు నిండాయి. ఇప్పుడు 5వ డైరీలో ఆయన రాయిస్తున్నారు. ఇలా మొదటి విడత బాల వికాస యాత్రలో పూర్వపు తెలంగాణ పది జిల్లాలలోని 24 మండలాలల్లో 263 ప్రదర్శనలు ఇచ్చారు. బాలవికాస యాత్ర ఐదేళ్లు పూర్తి చేసుకుంది. తాను మొదట వెళ్లిన పాఠశాలల విద్యార్థులు ఇప్పుడు హైస్కూళ్లకు వెళ్లారు. అంతటా కొత్త పిల్లలుంటారని భావించిన ఎన్నవెల్లి రాజమౌళి 2017 జూన్ 28న తాను మొట్టమొదట బాల వికాస యాత్ర ప్రారంభించిన పల్లెపహాడ్ ప్రాథమిక పాఠశాల నుంచే రెండో విడత యాత్రకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికీ పలు పాఠశాలల్లో ప్రదర్శనలిచ్చారు.

ముద్రిత రచనలు

చిలుక పలుకులు(బాల గేయాలు), బాలల మనస్తత్వాలు (విద్యా విషయక వ్యాస సంపుటి), నేను, పూర్ణాంగి(కవిత సంపుటిలు), భక్తపోతన(భారత,భారతీ పుస్తకమాల), ఎన్నవెల్లి కథలు, అమ్మమ్మ కథలు(బాలల కథలలు) పుస్తకాలను రాజమౌళి ప్రచురించారు. కథలు, కవితలు పలు పత్రికల్లో ప్రచురితమయ్యాయి.

శక్తి ఉన్నంత వరకు బాల వికాస యాత్ర నిర్వహిస్తా

కథల తాతయ్యగా, బాల సాహితీ శిల్పిగా నాకు లభించిన గుర్తింపునకు అనుగుణంగా నా శరీరంలో శక్తి ఉన్నంత వరకు బాల వికాస యాత్ర నిర్వహిస్తా. ఎన్ని అవార్డులు వచ్చినా, రివార్డులు వచ్చినా వాటన్నింటికంటే పిల్లల ఆనందమే నాకు ఇష్టం. వారితో లీనంకావడమే నాకు పెద్ద అవార్డు. పిల్లల ముద్దుముద్దు మాటలు వినడమంటే మక్కువ. - ఎన్నవెల్లి రాజమౌళి

ఉద్యోగం లేదు..

ఆటోనే జీవనాధారం



- చదివిన చదువులకు తగిన జాబ్‌లు రాకపోవడంతో స్వయం ఉపాధిని ఎంచుకున్న యువకులు
- ఇబ్బందుల మధ్య జీవనం
- ఆటోలు నిలిపేందుకు స్టాండ్‌ల సమస్య
- సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతున్న డ్రైవర్లు

నారాయణఖేడ్ : చదివిన చదువులకు అనుగుణంగా ఉద్యోగాలు రాకపోవడంతో వారంతా ఆటోడ్రైవర్లుగా మారారు. కుటుంబ పోషణకు రేయింబవుళ్లు అష్టకష్టాలుపడుతున్నారు. నారాయణఖేడ్ ప్రాంతానికి చెందిన కొందరు యువకులు ఉద్యోగావకాశాలు లేకపోవడంతో గత్యంతరం లేక ఆటోవాలాలుగా మారారు. ఇందులో కొందరు ఆటోలు కొనేందుకు డబ్బుల్లేక రోజూ అద్దె ప్రాతిపాదికన ఇతరుల ఆటోలు నడుపుతున్నారు. మరికొందరు ఫైనాన్సర్ల ఆర్థిక సహాయంతో ఆటోలను కొనుగోలు చేసి నడుపుతున్నారు. ఉదయం లేచింది మొదలు రాత్రి వరకు కష్టపడి ఆటోలు నడుపుతున్నా.. తమకు మిగిలేది అంతంత మాత్రమేనని ఈ యువకులు ఆవేదన చెందుతున్నారు. అలాగే మరిన్ని ఇబ్బందులను వీరు ఎదుర్కొంటున్నారు. కొన్నిసార్లు పోలీసుల వేధింపులతో భయంభయంగా ఆటోలు నడపాల్సి వస్తుంది. పెరిగిన నిర్వహణ చార్జీల వల్ల సామర్థ్యానికి మించి ప్రయాణికులను చేరవేస్తేనే గిట్టుబాటు అవుతుంది. కొన్ని సార్లు ప్రయాణికులు దొరకని పరిస్థితి కూడా ఉంటుంది. ఆ పరిస్థితుల్లో గంటల తరబడి వారి కోసం నిరీక్షణ చేయాల్సి ఉంటుంది. దీంతో చాలాసార్లు రాత్రిదాకా వేచి చూసిన ప్రయాణికులు లేక ఒట్టి చేతులతో ఇంటికి వెళ్లిన సందర్భాలున్నాయని ఈ ఆటో డ్రైవర్లు ఆవేదన చెందుతున్నారు. తాము సేవా దృక్పథంతోనే పని చేస్తున్నప్పటికీ కనీసం తమకు ఆటోలు నిలపడానికి అడ్డాలు కూడా లేవని వీరు పేర్కొంటున్నారు. ప్రభుత్వపరంగా ఎలాంటి ప్రోత్సాహకాలు లేవన్నారు. ఆటో నడప డానికి లైసెన్సులు కూడా పొందలేని పరిస్థితుల్లో కొందరు ఉన్నారని, ప్రభుత్వం ఆటో వాలాలను ఆదరించాలని వీరు కోరుతున్నారు. తమకు కూడా ప్రభుత్వం ఇతర వృత్తుల వారికి అందిస్తున్న విధంగా కార్పొరేషన్‌ల ద్వారా రుణాలు ఇప్పించడమే కాకుండా విద్యార్హతలతో నిమిత్తం లేకుండా డ్రైవింగ్ లైసెన్సులు ఇప్పించాలని పేర్కొన్నారు. ఇక 50 సంవత్సరాల వయస్సు నిండిన వారికి ప్రతి నెలా పింఛన్ సౌకర్యం కల్పించాలని ఆటో కార్మికులు కోరుతున్నారు.



ఆటో నడుపుతున్న సంజీవన్‌రావుపేటకు చెందిన రాములు

భయం భయంగా ఆటో నడుపుతున్నాం



కుటుంబ పోషణ కోసం చదువుకున్న చదువుకు ఉద్యోగం లేక ఆటో డ్రైవర్‌గా మారాను. ఉదయం లేచింది మొదలు ఆటో తీసుకుని ఇంటి నుంచి బయల్దేరుతాను. ప్రయాణికుల కోసం వెళ్తున్న క్రమంలో ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతాయోనని భయంభయంగా ఆటో నడపాల్సి వస్తుంది. మేము ఆటోలను నిలపడానికి కనీసం అడ్డాలు కూడా లేవు. అందువల్ల ప్రభుత్వం ఆటో అడ్డాలను ఏర్పాటు చేసి అధికారుల వేధింపులు ఉండకుండా చూడాలి.

- ఖాజా, ఆటో డ్రైవర్, నాగల్‌గిద్ద

ఆటోల కొనుగోలుకు కార్పొరేషన్ల ద్వారా రుణాలు ఇప్పించాలి

స్వయం ఉపాధి పొందడం కోసం ఆటోలను కొనుగోలు చేయడానికి ప్రభుత్వం కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇప్పించాలి. నేత కార్మికులు, గీతా కార్మికులకు ఇస్తున్న మాదిరిగా మాకు కూడా పింఛన్ ఇప్పించాలి. డబుల్ బెడ్‌రూం గృహాలు కూడా ఇవ్వాలి.

- రాజు, ఆటో డ్రైవర్ , దామర్‌గిద్ద



విద్యార్హతతో నిమిత్తం లేకుండా ఆటో డ్రైవర్లందరికీ లైసెన్సులు ఇవ్వాలి



ఆటోలు నడుపుతూ జీవనం కొనసాగిస్తున్న ఆటోవాలాలందరికీ విద్యార్హతతో నిమిత్తం లేకుండా డ్రైవింగ్ లైసెన్సులు ఇవ్వాలి. నారాయణఖేడ్ ప్రాంతంలో ఆటోలపై ఆధారపడి దాదాపు ఐదు వందల మంది వరకు జీవనం కొనసాగిస్తున్నారు. ఆటోలపై ఆధారపడిన వారికి స్వంత ఆటోల కొనుగోలు చేసేందుకు కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇప్పించాలి.

- చిరంజీవి, సీఐటీయూ డివిజన్ కార్యదర్శి

'ఫోర్బ్స్' ప్రపంచ ధనవంతుల జాబితాలో తొలిస్థానం ఎవరిది?



ఎస్.మహిపాల్ రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

1. 'మ్యాన్ బుకర్ ప్రైజ్-2017' ఎంపిక జాబితాలో నిలిచిన భారత రచయిత్రి అరుంధతిరాయ్ రచించిన పుస్తకం?
ఎ) ద షేప్ ఆఫ్ ద బీస్ట్
బి) ద చెక్‌బుక్ అండ్ ద క్రుయిజ్ మిస్సైల్
సి) ద మినిస్ట్రీ ఆఫ్ అట్ మోస్ట్ హ్యాపీనెస్
డి) బ్రోకెన్ రిపబ్లిక్

2. ప్రధాని రేడియో ప్రసంగాలను పొందుపరుస్తూ ఇటీవల వెలువడిన 'మన్ కి బాత్ ఎ సోషల్ రెవల్యూషన్ ఆన్ రేడియో'ను రచించింది?
ఎ) ఎన్.సి.ఉల్లేఖ్ బి) ఎ.సూర్యప్రకాశ్
సి) కె.సి.మాథుర్ డి) రాజేష్ జైన్

3. మానవ అక్రమ రవాణ వ్యతిరేక దినోత్సవం?
ఎ) ఆగస్టు 2 బి) జూలై 30
సి) జూలై 25 డి) ఆగస్టు 8

4. డిఆర్‌డిఒ రూపొందించిన తొలి స్వదేశీ మానవరహిత యుద్ధ ట్యాంక్?
ఎ) వైజయంతి
బి) మిథుల
సి) మంత్ర
డి) ఫారత్



5. డిఆర్‌డిఒకు సంబంధించి సరైనది?
ఎ) డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్
బి) స్థాపన - 1958 సి) డైరెక్టర్ - క్రిస్టోఫర్
డి) పైవన్నీ

6. ప్రపంచ బ్యాడ్మింటన్ సంఘం ఇటీవల ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో పురుషుల విభాగంలో అత్యుత్తమంగా 8వ ర్యాంక్ ఎవరిది?
ఎ) సాయిప్రణీత్ బి) పారుపల్లి కశ్యప్
సి) కిదాంబి శ్రీకాంత్ డి) అజయ్ జయరాం

7. ప్రపంచ బ్యాడ్మింటన్ సంఘం ఇటీవల ప్రకటించిన మహిళల ర్యాంకింగ్స్‌లో అత్యుత్తమంగా 5వ ర్యాంక్ పొందినది?
ఎ) సైనా నెహ్వాల్ బి) సయాలి గోఖలే
సి) పి.వి.సింధు డి) గుత్తా జ్వాలా

8. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో వందేమాతరం తప్పనిసరిగా ఆలపించాలని ఇటీవల ఏ హైకోర్టు తీర్పునిచ్చింది?
ఎ) మద్రాస్ హైకోర్టు బి) అలహాబాద్ హైకోర్టు
సి) కేరళ హైకోర్టు డి) ముంబై హైకోర్టు

9. ఆసియా నోబెల్‌గా పరిగణించే రామన్ మెగసెసె అవార్డుకు సంబంధించిన సరైనది?
ఎ) 1958 నుంచి ప్రదానం బి) విభాగాలు - 6
సి) తొలి భారత గ్రహీత - ఆచార్య వినోబా భావే (1958) డి) పైవన్నీ

10. అండర్ 19 ఆసియా ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు 2018లో ఆతిథ్యం ఇస్తున్న దేశం?
ఎ) ఇండోనేషియా బి) ఇండియా
సి) ఫిలిప్పీన్స్ డి) సింగపూర్

11. ఇటీవల మరణించిన ఎన్.ధరంసింగ్ ఏ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేశారు?
ఎ) పంజాబ్ బి) హర్యానా సి) కర్ణాటక డి) మహారాష్ట్ర

12. దేశంలోనే తొలిసారిగా 'ఆన్ గో' అనే మొబైల్ ఆధారిత టికెట్ వ్యవస్థను ప్రవేశపెట్టిన మెట్రో రైలు?
ఎ) కోల్‌కతా మెట్రో బి) ఢిల్లీ మెట్రో
సి) బెంగళూరు మెట్రో డి) ముంబై మెట్రో

13. నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజి ఇటీవల 'India Quake' అనే మొబైల్ యాప్‌ను ప్రవేశపెట్టింది. సిస్మోలసిజి అంటే?
ఎ) భూకంపాల అధ్యయన శాస్త్రం
బి) మృత్తిక అధ్యయన శాస్త్రం
సి) వాతావరణ అధ్యయన శాస్త్రం
డి) జనాభా అధ్యయన శాస్త్రం

14. ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం?
ఎ) జూలై 29 బి) జూలై 30
సి) జూలై 28 డి) ఆగస్టు 7

15. ఆసియాభివృద్ధి బ్యాంక్ గవర్నర్స్ బోర్డుకు భారత తరపున ఇటీవల ఎవరు నామినేట్ అయ్యారు?
ఎ) శక్తికాంత్ దాస్
బి) సుభాష్ చంద్రగార్గ్
సి) అమితాబ్ కాంత్
డి) అరవింద్ సుబ్రమణియం

16. ఆసియాభివృద్ధి బ్యాంక్‌కు సంబంధించి సరైనది?
ఎ) స్థాపన - 1966
బి) ప్రధాన కార్యాలయం - మనీలా (ఫిలిప్పీన్స్)
సి) సభ్య దేశాలు - 67
డి) పైవన్నీ

17. కార్గిల్ విజయానికి గుర్తుగా జూలై 26న విజయ్‌దివస్‌గా నిర్వహిస్తారు. అయితే కార్గిల్ విజయం కోసం సైన్యం చేపట్టిన కార్యక్రమం?
ఎ) ఆపరేషన్ పరాక్రమ్ బి) ఆపరేషన్ విజయ్
సి) ఆపరేషన్ రాహత్
డి) ఆపరేషన్ సంకటమోచన్

18. బెంగాల్ ప్రభుత్వం అందించే 'మహానాయక్ సమ్మాన్-2017' అవార్డు గ్రహీత?
ఎ) శరద్ పవార్ బి) విరాట్ కోహ్లి
సి) శకుంతల బారువ డి) లతా మంగేష్కర్

19. 'ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్-2021'కి ఆతిథ్యం ఇవ్వనున్న దేశం?
ఎ) క్యూబా బి) ఇండియా సి) మంగోలియా డి) టర్కీ

జికె అండ్ కరెంట్ అఫైర్స్

20. దేశంలోనే తొలిసారిగా ప్రైవేటు రంగ సంస్థ రిలయన్స్ నిర్మించిన గస్తీ నౌకలు?
ఎ) భారతి, కోకిల బి) శచి, శృతి
సి) భారతి, సింధు డి) సింధు, సాగరిక

21. 'CANDI' అనే పేరుతో బెంగళూరు కేంద్రంగా తొలి డిజిటల్ బ్యాంకింగ్ శాఖను ప్రారంభించింది?
ఎ) బ్యాంక్ ఆఫ్ ఇండియా బి) కర్ణాటక బ్యాంక్
సి) కెనరా బ్యాంక్ డి) ఇండియన్ బ్యాంక్

22. కాంబోడియాలోని ఆంగ్‌కోర్‌వాట్ వంటి సాంస్కృతిక కేంద్రాల పరిరక్షణకు చేసిన కృషికి 2017లో 'రామన్ మెగసెసె' అవార్డు పొందింది?
ఎ) గిత్సె షణ్ముగం(శ్రీలంక)
బి) టోనిటా(సింగపూర్)
సి) లిలియ లె డిమ(ఫిలిప్పీన్స్)
డి) యొషియాకి ఇషిజావ(జపాన్)

23. యాక్సిస్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్‌గా తిరిగి నియామకమైనవారు?
ఎ) పి.ఎస్.జయకుమార్
బి) దీనబంధు మహాపాత్ర
సి) జైకుమార్ నర్గ్
డి) శిఖాశర్మ



24. తీర ప్రాంత ప్రజలు, వర్గాలకు అన్ని రకాల సమాచారం, సలహాలు అందించడానికి కేంద్రం ప్రారంభించిన సాఫ్ట్‌వేర్ ప్రాజెక్టు?
ఎ) సేతు సముద్రం బి) సాగరవాసి
సి) సాగరిక డి) సాగర సహాయ్

25. సైకిల్ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక ట్రాక్‌ల నిర్మాణానికి పైలెట్ ప్రాజెక్టును ప్రారంభించిన రాష్ట్రం?
ఎ) కర్ణాటక బి) మహారాష్ట్ర
సి) ఆంధ్రప్రదేశ్ డి) త్రిపుర

26. ఇటీవల మండే స్వభావం గల ఐస్(మిథేన్ హైడ్రేట్) నుంచి విజయవంతంగా సహజ వాయువును వేరు చేసిన దేశం?
ఎ) జపాన్ బి) కెనడా సి) రష్యా డి) చైనా

27. పనామ పత్రాల లీకేజీ నేపథ్యంలో పదవి కోల్పోయిన పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్ ఏ పార్టీకి చెందినవాడు?
ఎ) పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ
బి) తెహ్రిక్-ఎ-ఇన్సాఫ్
సి) పాకిస్థాన్ ముస్లిం లీగ్
డి) అవామి నేషనల్ పార్టీ

28. 2017 జూలై 27న ట్రాన్స్ జెండర్లు మిలటరీలో పనిచేయడానికి అనర్హులుగా ప్రకటించిన దేశం?
ఎ) ఫ్రాన్స్ బి) నైజీరియా
సి) అమెరికా డి) బొలీవియా

29. దేశ అత్యున్నత న్యాయమూర్తులను ఏ ఇతర సంస్థలతో సంప్రదించకుండానే నియమించే అధికారం అధ్యక్షుడికి అప్పగిస్తూ రాజ్యాంగాన్ని సవరించిన దేశం?
ఎ) బొలీవియా బి) జింబాబ్వే
సి) ఫిలిప్పీన్స్ డి) సింగపూర్

30. ప్రపంచ బ్యాంక్, ప్రపంచ ద్రవ్యనిధి సంస్థల నుంచి పూర్తిగా విముక్తి పొందినట్లు ప్రకటించిన దేశం?
ఎ) కొలంబియా బి) సోమాలియా
సి) సిరియా డి) బొలీవియా

31. 2017 జూలై 27న 'సిమోర్గ్' అనే ఉపగ్రహ ఆధారిత రాకెట్‌ను అంతరిక్షంలోకి ప్రవేశపెట్టిన దేశం?
ఎ) ఉత్తర కొరియా బి) ఇరాన్
సి) పాలస్తీన డి) ఇజ్రాయెల్

32. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2017 ఆగస్టు 1 నుంచి సెప్టెంబరు 8 వరకు ఏ వ్యాధుల కోసం ప్రత్యేక టీకా కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది?
ఎ) తట్టు, రూబెల్లా బి) తట్టు, హెపటైటిస్
సి) రుబెల్లా, పోలియో డి) తట్టు, టెటానస్

33. హంగేరియన్ ఫార్ములా వన్ గ్రాండ్‌ప్రి-2017 విజేత?
ఎ) లూయిస్ హామిల్టన్ బి) రైకోనిన్
సి) సెబాస్టియన్ వెటెల్ డి) బొట్టాస్

34. ప్రపంచంలోనే అతి పొడవైన పాదచారుల వంతెనను ఇటీవల ప్రారంభించిన దేశం?
ఎ) ఇండియా బి) చైనా సి) స్విట్జర్లాండ్ డి) జర్మనీ

35. ఇటీవల చైనాలోని ఫుజియల్ ప్రావిన్స్‌లో విధ్వంసం సృష్టించిన టైఫూన్?
ఎ) హైటాంగ్ బి) నొమురా
సి) తుయయు డి) ఇయాంగ్

36. 'ఫోర్బ్స్' ప్రపంచ ధనవంతుల జాబితాలో తొలిస్థానంలో ఎవరిది?
ఎ) బిల్‌గేట్స్(మైక్రోసాఫ్ట్)
బి) జెఫ్ బెజోస్ (అమెజాన్)
సి) వారన్ బఫెట్ (వాల్‌మార్ట్)
డి) అజీం ప్రేమ్‌జీ(విప్రో)



37. ఆహార పదార్థాలు, పానియాల్లో ద్రవ నైట్రోజన్ కలపడంపై నిషేధం విధించిన రాష్ట్రం?
ఎ) గుజరాత్ బి) హర్యానా
సి) రాజస్థాన్ డి) ఉత్తరప్రదేశ్

38. ప్రపంచంలోనే 100 శాతం 'గ్రీన్ రైల్వే'గా ఇటీవల గుర్తింపు పొందినది?
ఎ) చెన్నై మెట్రో రైల్వే
బి) బెంగళూరు మెట్రో రైల్వే
సి) కోల్‌కత మెట్రో రైల్వే డి) ఢిల్లీ మెట్రో రైల్వే

39. 2017 జూలై 27, 28 తేదీల్లో బ్రిక్స్ దేశాల జాతీయ భద్రత సలహాదారుల సమావేశాన్ని నిర్వహించిన నగరం?
ఎ) సోచి(రష్యా) బి) ఫోర్ట్‌లెజా(బ్రెజిల్)
సి) బీజింగ్(చైనా) డి) డర్బన్(దక్షిణాఫ్రికా)

40. 'హంబంటోటా' పోర్టులో 70 శాతం వాటాను ఏ దేశానికి విక్రయిస్తూ శ్రీలంక నిర్ణయించింది?
ఎ) ఫిలిప్పీన్ బి) ఇండియా సి) జపాన్ డి) చైనా

సమాధానాలు

		13) ఎ	20) బి	27) సి	34) సి
		14) డి	21) సి	28) సి	35) ఎ
1) సి	7) సి	15) బి	22) డి	29) బి	36) బి
2) డి	8) ఎ	16) డి	23) డి	30) డి	37) బి
3) బి	9) డి	17) బి	24) బి	31) బి	38) డి
4) సి	10) ఎ	18) సి	25) బి	32) ఎ	39) సి
5) డి	11) సి	19) బి	26) డి	33) సి	40) డి
6) సి	12) డి				

ఉద్యోగాలు

సింగరేణి కాలరీస్

